జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 5 సంచిక - 01 పక్షపత్రిక జనవరి 1-15, 2014






లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో "యూత్ ఇంపాక్ట్" కార్యక్రమంలో డా॥ జేపీ



కూకట్‌పల్లిలో వాటర్‌పైప్ లైన్ శంకుస్థాపన



కూకట్‌పల్లి నియోజకవర్గంలో ప్రజలతో డా॥ జేపీ



పాలెం బస్సు దహనం మృతులకు పరిహారాన్ని కోరుతూ హైదరాబాద్‌లో క్రొవ్వొత్తులతో నిరసన

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జనవరి 1-15, 2014

సంపుటి - 5 సంచిక - 01

## లోపలి పేజీల్లో...

మార్పుకి సమయం వచ్చింది
- రాష్ట్ర ప్రజలకు జేపీ పిలుపు ..........6
రాష్ట్ర సంక్షోభాన్ని పరిష్కరించే పార్టీ లోక్‌సత్తా మాత్రమే ..........8
విభజన బిల్లులో రాజ్యాంగ ఉల్లంఘనలు ....11
ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చకు ముందు తగిన సమాచారం ఇవ్వాలి.........12
లోక్‌పాల్ బిల్లు ఆహ్వానించదగ్గదే ............13
అసలు తిరకాసు ఎన్నికల వ్యవస్థదే..........15
ఓటర్లకు వజ్రాయుధం...........................17
లోక్‌సత్తా పార్టీని గెలిపించుకోలేమా? ....18
సామాజిక శాస్త్రాల ఊసేదీ.....................21
ఉద్యమాల బాటలో లోక్‌సత్తా................24
జిల్లా వార్తలు

## సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

### సంపాదక వర్గం

పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : కె. శ్రీలత
ఫొటోలు : ఎన్. సందీప్ కుమార్

## ఈ పక్షం చాట్ మసాలా

**1. రాహుకాలం**

"రాహుల్‌తోనే ముందుకెళతాం" - కాంగ్రెస్ నేత జనార్ధన్ ద్వివేది

ఇది కాంగ్రెస్‌కు రాహుల్ కాలం కాదు రాహుకాలం.... జాగ్రత్త

**2. కుడి ఎడమైతే...**

"ఒక ఓటు-ఒక నోటుతో జనంలోకి" - బి.జె.పి. ప్రచార నినాదం

ప్రచారానికి ఓకే. కాని..

ఎన్నికల నాడు ఒక ఓటుకు ఒక నోటుగా నినాదాన్ని సవరించకండి

**3. పొత్తుల వైరాగ్యం**

"ఎన్నికలలో ఒంటరిగానే పోరు" - సి.పి.ఐ. నారాయణ

నారాయణ, నారాయణ...

జతకట్టే వాళ్లు లేనప్పుడు పొత్తుల వైరాగ్యం తప్పుతుందా!

**4. మొయిలు మీద ఫైళ్లు**

"ఒక్క పర్యావరణ దస్త్రాన్ని కూడా పెండింగ్‌లో వుంచం" - కేంద్రమంత్రి మొయిలీ

పెండింగ్‌లో వుంచితే ఫండింగ్ వుండదు

దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి మరి

**5. ఆవు-దూడ**

"పోలీసు అదుపులో జగన్ పత్రిక ఉద్యోగి" - పత్రికా వార్త

యజమాని చేలో మేస్తే ఉద్యోగి గట్టున మేస్తాడా!

**6. గాలి తీసిన "ట్యూబ్"**

"ఆమ్ ఆద్మీ పార్టీ చెయ్యిపట్టుకున్నది ఎందుకంటే"

- కాంగ్రెస్‌తో దోస్తీపై వివరణ ఇస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఏడు భాషల్లో యూ ట్యూబ్‌లు విడుదల

ఆత్మ సమర్థనకు పోతే...

యూ ట్యూబులు అసలు గాలి తీస్తాయేమో చూడండి

**7. కాగల కార్యం**

"కాంగ్రెస్ ఓడ ఖాళీ..." - షోకాజ్ పై జె.సి. వ్యాఖ్య

ఎలాగూ పోయే కాలమేగదా!

అధిష్ఠానం తీసేస్తే దూకడం ఈజీ...

**8. శకున పక్షి**

"దేశం గూటికి మంత్రి గంటా!" - వార్తాగానం

వలస పక్షుల్లో ఎప్పుడూ గంటా ఫస్ట్...

దూకిన పార్టీకి అదే లాస్ట్

❖❖❖



# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034

**ఫోన్ నంబర్లు :**
***040– 23311817, 23311819, 23311820, 23312829***
**ఫ్యాక్స్ : *040–23310612***

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040–23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# నూతన సంవత్సర ఆకాంక్షలు

## కొత్త రాజకీయానికి స్వాగతం, పాతకు వీడ్కోలు పలకండి

**సంపాదకీయం**

లోక్‌సత్తా పాఠకులందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు. కొత్త సంవత్సరంలోకి అడుగు పెడుతున్నాం. రోజులపరంగా చూస్తే ఇందులో ఏ కొత్తా కనపడదు. ప్రతి కొత్త సంవత్సరం మన ఆకాంక్షలు నెరవేర్చే ఆశాకిరణంగా కనిపిస్తుంది. అందుకే ఇది అందరికీ ఆకాంక్షల పండుగ అయింది. తమ బంధుమిత్రులకు మంచి జరగాలని శుభాకాంక్షలు అందించడంలోనూ ఇదే కనిపిస్తుంది.

ఈ కొత్త సంవత్సరం మన వ్యక్తిగత జీవన ఆకాంక్షలకే కాకుండా రాజకీయపరమైన ఆకాంక్షలకి నిలయం కానుంది. ఎన్నికల సంవత్సరం కావడంతో ప్రజల రాజకీయ ఆకాంక్షలను పరీక్షించుకునే సంవత్సరం కానుంది.

దేశంలో పరిస్థితులు అధ్వాన్నంగా వున్నాయి. అవినీతి కుంభకోణాలతో, అస్తవ్యస్తంగా మారిన ఆర్థిక వ్యవస్థతో, జనజీవనం దుర్భరం అయింది. అధికారంలో వున్న యు.పి.ఎ. పాలించే నైతిక హక్కు ను ఏనాడో కోల్పోయింది. దాని వీడ్కోలుకు రోజులు దగ్గర పడుతున్నాయి. అలాగే ప్రాంతీయ పార్టీలు, ప్రధాన ప్రతిపక్షం ఏవీ కూడా కొత్త రాజకీయాన్ని అందించే స్థితిలో లేవు. కులం, మతం, ప్రాంతం, ధనబలం, కండబలాల పోటీ తప్ప ప్రత్యామ్నాయం గోచరించడం లేదు. ఒక పాతను వదిలించుకుంటే మరో పాతని తగిలించుకోవడంగానే కనిపిస్తున్నది.

ఇలాంటి తరుణంలో ఢిల్లీలో జరిగిన పరిణామం కొన్ని రాష్ట్రాలలో మార్పుకు శ్రీకారం చుట్టేదిగా కనిపిస్తున్నది. సరైన ప్రత్యామ్నాయం వుంటే కొత్త రాజకీయానికి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా వున్నారనడానికి ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఒక సంకేతం. మన రాష్ట్రంలో అలాంటి మార్పు సాధించి తీరాలి. ఇది మన నూతన సంవత్సర ఆకాంక్ష కావాలి. ఈ ఎన్నికలు దానిని సాధించే మహత్తర అవకాశం కావాలి.

మన రాష్ట్రంలో పరిస్థితి దేశంలో కంటే అధ్వాన్నంగా వుంది. ఇక్కడ అవినీతి పుష్కలంగా సాగింది. అందులోనుండే ఒక పార్టీ పుట్టుకొచ్చింది. ఇక్కడ పాలన స్తంభించింది. అధికారంలో వున్న పార్టీ పాలించే స్థితిలో లేదు. రాష్ట్రాన్ని చక్కదిద్దే స్థితిలో అంతకంటే లేదు.

సంప్రదాయ పార్టీలు అన్నీ రాష్ట్రంలో సంక్షోభానికి తిలా పాపం తలా పిడికెడు అన్నట్టు కారణం అయ్యాయి. అవి ప్రాంతాల వారీగా చీలిపోయాయి. రాష్ట్ర విభజన సమస్యకు పరిష్కారాన్ని వెదకడానికి బదులు అవి సమస్యలో భాగం అయ్యాయి. ఏకాభిప్రాయం సాధించుకోలేని పార్టీలే ఈ దుస్థితికి కారణం. సమస్యను పరిష్కరించే సత్తా లేని పార్టీలు తమ సంక్షోభాన్ని రాష్ట్ర సంక్షోభంగా మార్చాయి. ఆ ఊబిలోనే అవి అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రాన్ని ముంచేస్తున్నాయి.

సంప్రదాయ పార్టీల పాపమే రాష్ట్ర ప్రజల పాలిట శాపం అయింది. ఈ ఎన్నికల్లో మనం శాప విముక్తులం కావాలి. సమస్యకు సమగ్రమైన, సామరస్య పూర్వకమైన పరిష్కారం సాధించే సత్తాగల వారిని ఎన్నుకోవాలి. నిజాయితీ రాజకీయానికి, సుపరిపాలనకు పట్టం కట్టాలి. ఇక్కడ లోక్‌సత్తా వుంది. ప్రజలకు ఓటు సత్తా ఉంది. కొత్త రాజకీయానికి ప్రజలు సత్తా చూపాలి. నూతన సంవత్సర ఆకాంక్షని సాధించాలి. ◆



# మార్పుకి సమయం వచ్చింది

## కొత్త రాజకీయానికి మద్దతు నివ్వండి

### - రాష్ట్ర ప్రజలకు జేపీ పిలుపు

ఉద్యమంగా, పార్టీగా లోక్‌సత్తా గత 17 ఏళ్లుగా అవిశ్రాంతంగా సమగ్ర ఎజెండాతో, ముందుచూపుతో చేస్తున్న పోరాటం వల్ల ఈవేళ రాజకీయాలలో కీలక మార్పులకు సమయం ఆసన్నమైందని, రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి నగర స్థాయి వరకూ యువత, మధ్యతరగతి, మహిళలు, రైతులు వలంటీర్లుగా, నాయకులుగా తమ సమయాన్ని, వనరులను కేటాయించి 2014 ఎన్నికలలో కొత్త రాజకీయాన్ని సాకారం చేయాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పిలుపునిచ్చారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ పెద్దఎత్తున విజయం సాధిస్తుందని ఫలితాలకు వారం రోజుల ముందు కూడా ఎవరూ ఊహించలేదని, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి, దుష్పరిపాలన, తాత్కాలిక తాయిలాలు, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే పాలన, రాజకీయం కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలకు కూడా మార్పు తెచ్చుకునేందుకు వచ్చే ఎన్నికలు ఒక గొప్ప అవకాశమని అన్నారు. అవకాశమిస్తే రాష్ట్ర రాజకీయాల్ని సమూలంగా మార్చి కొత్త దశ, దిశ ఇచ్చే శక్తి లోక్‌సత్తాకే ఉందన్నారు. మభ్యపెట్టే వాగ్దానాలు, ప్రజల మధ్య చిచ్చుపెట్టటం ద్వారా కాకుండా నిజాయతీగా ఈ మార్పుని లోక్‌సత్తా సాధించగలదన్నారు. ద్వేష, అవినీతి రాజకీయాల పట్ల విసిగిపోయినవారు, పేదరికం పోవాలని, యువతకు ఉపాధి అవకాశాలు రావాలని ఆశిస్తున్నవారంతా కదలాలని, లోక్‌సత్తా భావజాలం పట్ల, కృషి పట్ల అభిమానం గల వాళ్లు రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఉన్నారని, వారంతా ముందుకు రావాలని కోరారు. అన్ని సమస్యలకూ పరిష్కారం చూపాల్సిన రాజకీయమే సమస్యగా మారిందని, రాజకీయాన్ని ఒక పవిత్ర వ్యాసంగంగా మార్చాలని లోక్‌సత్తా ఇన్నేళ్లుగా చేస్తున్న పోరాటం వల్ల ఓటుకు దూరంగా ఉన్న వాళ్లంతా ఇప్పుడు ఓటు వేయటాన్ని ఒక గౌరవంగా భావిస్తూ రాజకీయాల పట్ల ఆసక్తి చూపుతున్నారని, దీనికి ఎంతో సంతోషిస్తున్నామని అన్నారు. ఓటరు జాబితాల ప్రక్షాళన, ఎన్నికలలో నేరచరితుల వివరాలు బైటపెట్టటం, నిజాయతీ రాజకీయాలకు వీలుగా పార్టీల నిధుల సేకరణకు చట్టం తేవటం, మంత్రివర్గ సంఖ్య కుదింపు, పార్టీ ఫిరాయింపుల నిరోధం వంటి సంస్కరణలు, సమాచార హక్కు, సహకార సంఘాల స్వయంప్రతిపత్తికి 97వ రాజ్యాంగ సవరణ, స్థానిక న్యాయాలయాల చట్టం, జాతీయ ఆరోగ్య మిషన్, లోక్‌పాల్, జ్యుడీషియల్ కమిషన్ వంటి కీలక చట్టాలు లోక్‌సత్తా వల్లే సాకారమయ్యాయన్నారు. ఈ కృషి ప్రజలలో వేళ్లూనుకుని మార్పులు రావటం మొదలైందన్నారు. "సమయం ఆసన్నమైనప్పుడు మోహరించిన సైన్యాలు కూడా మౌలిక మార్పుల్ని ఆపలేవు" అన్న నానుడిని జేపీ ఉటంకించారు.

**రాష్ట్రంలో, దేశంలో రాజకీయ పరిస్థితుల మీద, ప్రజా సమస్యల మీద చర్చించేందుకు లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో సమావేశమైన పార్టీ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి జయప్రకాష్ నారాయణ్ మీడియాకు తెలియచేశారు.**

**జేపీ మాట్లాడుతూ...** 2014 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సత్తా కొత్త రాజకీయాన్ని బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన అంశాలు, అనుసరించాల్సిన ప్రచార వ్యూహంపై కార్యవర్గ సమావేశం లోతుగా చర్చించిందని తెలిపారు. అవినీతి అంతం, పేదరిక నిర్మూలన, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, లాభసాటి వ్యవసాయం, 24 గంటల విద్యుత్, మద్య నియంత్రణ, అధికార వికేంద్రీకరణతో జనం చేతికి అధికారం ఇవన్నీ లోక్‌సత్తాతో మాత్రమే సాధ్యమని, ఈ విధానాలను ఆచరణలో కూడా లోక్‌సత్తా రుజువు చేసి చూపిందని, ఈ వాస్తవాల్ని ప్రజల్లోకి బలంగా, విస్తృతంగా తీసుకెళ్లి కొత్త రాజకీయం సాధనలో వారిని భాగస్వాముల్ని చేస్తామని అన్నారు. పండించిన పంటలకు లాభసాటి రేటు

లభించేలా ఆంక్షలు లేని మార్కెట్ కోసం లోక్‌సత్తా చేసిన పోరాటం వల్ల రైతులకు మంచి ధరలు లభించాయని, ఆ విషయాన్ని చివరి రైతు వరకూ ప్రచారం చేస్తామని అన్నారు. మద్యం వల్ల లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోవటం, మహిళలు తీవ్రహింసలకు గురవటం, అకాల వైధవ్యానికి గురికావటం వంటి భయంకర సమస్యల్ని లోక్‌సత్తాయే బైటికి తెచ్చిందని, మద్యనియంత్రణకు లోక్‌సత్తా చేస్తున్న పోరాటాన్ని చివరి మహిళ వరకూ తీసుకెళ్తామని అన్నారు. లోక్‌పాల్ బిల్లు ఎటువంటి గందరగోళం లేకుండా రూపొందటానికి 2011లో అనేకమంది జాతీయస్థాయి సుప్రసిద్ధ ప్రముఖులతో లోక్‌సత్తా నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయాలు కీలక పాత్ర పోషించాయని, దాంతోపాటు పౌరులకు ప్రభుత్వ సేవలు నిర్దిష్ట కాలపరిమితిలోగా అందేలా, అలా అందకపోతే రోజుకు రూ.250 వరకూ పరిహారం చెల్లించేలా పౌరసేవల హక్కు చట్టాన్ని కూడా తీసుకొచ్చేందుకు గట్టి కృషి చేస్తున్నామని, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 10శాతం నేరుగా ప్రజలకు ఇచ్చి తలసరి ప్రతి పౌరునికీ రూ.1500 వచ్చేలా చేసేందుకు కూడా పోరాడుతున్నామని, ఈ అంశాలన్నిటినీ ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్తామన్నారు. ఆర్యోగశ్రీలో లేని జబ్బులకు వైద్యం వల్ల అనేకమంది ప్రజలు పేదరికంలో కూరుకుపోతున్నారని, అందరికీ అన్ని జబ్బులకీ ఉచిత వైద్యం అందించే పథకాన్ని లోక్‌సత్తా అందిస్తుందన్నారు. పేదలు పేదలుగానే కొనసాగే చదువు స్థానంలో ప్రామాణికమైన విద్యను అందించి పేదరికాన్ని, కుల వివక్షని అంతం చేసేందుకు లోక్‌సత్తా గట్టి ప్రయత్నం చేస్తుందన్నారు.

వలంటీర్లుగా మాత్రమే కాకుండా ప్రజలు లోక్‌సత్తాకు పెద్దఎత్తున విరాళాలుకూడా ఇవ్వాలని, ప్రతి పైసాకూ లెక్కచెప్పి, సద్వినియోగం చేసి, పది రెట్లు మంచి రాజకీయ ఫలితాలు సాధించే బాధ్యత తనదని జేపీ చెప్పారు. లోక్‌సత్తా కొత్త రాజకీయం కృషిలో, కార్యక్రమాలలో ప్రజలు ఎక్కడికక్కడ భాగస్వాములవటానికి తగిన కార్యాచరణను ఒక వారంలో ఖరారు చేసి విడుదల చేస్తామన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీతో లోకసత్తాకు సన్నిహిత సంబంధాలున్నాయని, ఢిల్లీ ఎన్నికలలో కూడా లోక్‌సత్తా వలంటీర్లు పెద్దసంఖ్యలో పనిచేశారని ఒక ప్రశ్నకు సమాధానంగా జేపీ చెప్పారు. ఎన్నికల సమయంలో పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

**కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ...** రాష్ట్ర ప్రజల్ని పీడిస్తున్న మూడు ప్రధాన సమస్యల మీద వచ్చే మూడు నెలల్లో ప్రజల్ని భాగస్వాముల్ని చేస్తూ ఆందోళనల్ని చేపడతామని తెలిపారు. రాజీవ్ యువకిరణాలు, విచ్చలవిడి మద్యం, కాలుష్య మంచినీరు వల్ల పెరుగుతున్న వ్యాధులు, రైతులకు లాభసాటి ధరలపై యువత, మహిళలు, మధ్యతరగతి మధ్య కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతులకు లాభసాటి ధరల కోసం కూడా కార్యక్రమం త్వరలో తీసుకుంటామన్నారు.

రాజీవ్ యువకిరణాల పథకంలో భాగంగా 2014 నాటికి 15లక్షల ఉద్యోగాలనిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ప్రతి ప్రైవేటు ఉద్యోగాన్నీ ఆ ఖాతాలో వేసుకుని ఇప్పటివరకూ 4 లక్షల ఉద్యోగాలనిచ్చినట్టు చెప్పుకుంటున్నారని ఈ దొంగ లెక్కల్ని బట్టబయలు చేస్తామని శ్రీనివాసరావు తెలిపారు. మంచినీటి కాలుష్యాన్ని బైటపెట్టే కిట్‌లను రాష్ట్రమంతటికీ సరఫరా చేస్తున్నామన్నారు.

సబ్సిడీ బియ్యం, ఫీజు రీ ఇంబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ సహా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకూ రాష్ట్ర ప్రభుత్వం రూ.23,000 ఖర్చు చేస్తున్నామని ముఖ్యమంత్రి స్వయంగా అసెంబ్లీలో ప్రకటించారని, మరోవైపు మద్యం పన్నుల ద్వారా ప్రజల నుంచి రూ.20,000 కోట్లు పిండుతోందని, తాగుడు మీద ప్రజలు రూ.40,000 కోట్లు ఖర్చు చేస్తున్నారని, వీరిలో ఎక్కువమంది పేదలేనని, అందుకే మద్యనియంత్రణను పెద్దఎత్తున చేపట్టామని జేపీ ఈ సందర్భంగా వివరించారు.

**లోక్‌సత్తా పార్టీ సభ్యత్వం తీసుకున్న** అమలాపురంకు చెందిన ప్రముఖ పిల్లల వైద్యులు డా॥ వి.ఎస్.ఎస్.ఎన్ మూర్తి, గైనకాలజిస్ట్ డా॥ రోహిణీ మూర్తికి పార్టీ కండువా కప్పి జేపీ సాదరంగా ఆహ్వానించారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి మారుత్, ఉపాధ్యక్షుడు బండారు రామ్మోహనరావు మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ■

# రాష్ట్ర సంక్షోభాన్ని పరిష్కరించే పార్టీ లోక్‌సత్తా మాత్రమే

**- డా॥ జయప్రకాష్ నారాయణ్**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ వల్ల కొన్ని ప్రాంతాలలో తలెత్తే ఆర్థిక లోటుకు పరిష్కారాలు చూపటంలో కేంద్రప్రభుత్వం ఘోరంగా విఫలమైందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ధ్వజమెత్తారు. ఇప్పుడున్న బిల్లు ప్రకారమే విభజన జరిగితే ఆర్థిక లోటు ఎదుర్కొంటున్న ప్రాంతాలలో ఉద్యోగుల జీతభత్యాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు స్తంభించిపోతాయన్నారు. జీతాలిస్తే ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించలేని, కార్యకలాపాలు నిర్వహిస్తే జీతాలివ్వలేని దయనీయ పరిస్థితి తలెత్తుతుందన్నారు. రాష్ట్ర విభజనకు సంబంధించి ప్రభుత్వాలు, మంత్రులు, ముఖ్యమంత్రి అన్ని రాష్ట్రాలలో ఒకటేనని తేడా అల్లా ఆదాయవ్యయాలు, వాటిని బట్టి ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపునకు, పాలన సాగటానికి, పథకాలు, ప్రాజెక్టుల అమలుకు, అభివృద్ధికి తగిన ఆదాయానికి ఏర్పాట్లు మాత్రమేనని, ఈ వాస్తవాల ఆధారంగానే ఇప్పుడు రాష్ట్రంలో చర్చ జరగాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ జరగాలంటే ముందు మనకున్న వనరులు,ఖర్చు ప్రాంతాలవారీగా తెలియాలని, ఇది అర్థంకాకుంటే పరిష్కారాలు సాధించలేమని అన్నారు.

ప్రభుత్వ నిర్వహణకు డబ్బు అత్యంత కీలకమని, డబ్బు లేకుండా పరిపాలన అనేదే ఉండదని, ఖర్చుకు తగ్గ డబ్బు ఎక్కడ్నుంచి వస్తుందో స్పష్టంగా తేల్చి ఏర్పాట్లు చేయాలని జేపీ డిమాండ్ చేశారు. పార్లమెంటుకు కేవలం రాష్ట్రాన్ని విభజించే అధికారం మాత్రమే లేదని, రేపు ఆంధ్రప్రదేశ్ ఎన్ని రాష్ట్రాలుగా ఏర్పడినా ఆదాయం ఎలా వస్తుందో వివరించి చెప్పాల్సిన బాధ్యత కూడా ఉందని స్పష్టంచేశారు. కేంద్రాన్ని, పార్లమెంట్‌ని ఈ మేరకు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల ప్రజలూ డిమాండ్ చేయాలన్నారు. ప్రజలలో, పౌరసమాజంలో, విశ్వవిద్యాలయాల్లో, నిపుణుల బృందాల్లో, ఆలోచనాపరుల్లో ఈ అంశంపై లోతైన చర్చ జరగాలన్నారు. ఇప్పుడు లోక్‌సత్తా ఇచ్చిన సమాచారాన్ని మరింత లోతుగా విశ్లేషించి అదనపు సమాచారాన్ని సైతం ఆవిష్కరించే ప్రయత్నాన్ని వారు చేయాలని, ఒక సమగ్ర, సామరస్య పరిష్కారం ద్వారా ఈ అంశాన్ని పరిష్కరించేలా కేంద్రప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాలని కోరారు. రాజకీయ పార్టీలు కేవలం ఓట్లు, సీట్లు దృష్టితో మాత్రమే రాష్ట్ర విభజన అంశాన్ని చూస్తున్నాయని, కానీ విభజన వల్ల అన్ని ప్రాంతాల ప్రజలకూ మేలు జరగాలంటే ఆదాయవ్యయాల పరిస్థితి, లోటును అధిగమించేందుకు తగిన ఏర్పాట్లు మీదే ప్రధానంగా చర్చ జరగాల్సుందని అన్నారు. ఈ వాస్తవాల్నిటినీ ప్రజలకు వివరిస్తూ న్యాయమైన, అందరికీ మేలు చేసే, ప్రభావవంతమైన పరిష్కారం కోసం ఒక్క లోక్‌సత్తా పార్టీ మాత్రమే కృషి చేస్తోందని, రాబోయే కాలంలో ఈ పరిష్కారాలతో లోక్‌సత్తా ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్తుందని తెలిపారు.




రాష్ట్రం మొత్తం, రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ, హైదరాబాద్ మినహా తెలంగాణ, హైదరాబాద్ ఆదాయవ్యయాల వివరాలను మంగళవారం ఇక్కడ లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి జయప్రకాష్ నారాయణ్ విడుదల చేశారు.

2012-13 సంవత్సరంలో ఖరారైన లెక్కల ప్రకారం రాష్ట్రానికి ఏటా వచ్చే మొత్తం ఆదాయం రూ. 1,27,566కోట్లు అని, ఇందులో పన్నులు, ఫీజులు ఇతరత్రా మార్గాల ద్వారా రాష్ట్రం సొంత ఆదాయం రూ. 75,874 కోట్లు, కేంద్రం నుంచి పన్నుల వాటాగా, పథకాలకు గ్రాంట్లుగా అందే ఆదాయం

రూ.27,956 కోట్లు, అదనంగా అప్పులు వంటి వాటి ద్వారా వచ్చేది రూ.23,310 కోట్లని జేపీ తెలిపారు. ఇందులో సుమారు మూడొంతులు రూ. 85,727 కోట్లు ప్రణాళికేతర ఖర్చుగా, రూ. 43,700 కోట్లు ప్రణాళికా వ్యయంగా ఉందని తెలిపారు. ఈ మొత్తం ఖర్చు రూ. 1,29,440 కోట్లు కావటంతో రాష్ట్రానికి స్థూలంగా ఏటా రూ. 1800–1900 కోట్లు లోటు ఉందన్నారు.

ప్రాంతాలవారీగా కాకుండా మొత్తం రాష్ట్రం ప్రాతిపదికన కేంద్ర గ్రాంటులు వగైరాల ద్వారా వచ్చే ఆదాయం సుమారు రూ.58,679 కోట్లు ఉందని, దీన్ని జనాభా ప్రాతిపదికన విభజిస్తే కోస్తాకు 40శాతం, రాయలసీమకు 18 శాతం, హైదరాబాద్ మినహా తెలంగాణకు 34 శాతం, హైదరాబాద్‌కు 8శాతం వచ్చిందని జేపీ తెలిపారు. దీంతోపాటు హైదరాబాద్‌లో పన్ను చెల్లింపులు చేసినా ఏ ప్రాంతంలో అమ్మకం ఉంటే ఆ పన్నును ఆ ప్రాంత ఆదాయంలో కలిపి ప్రాంతాల వారీగా ఆదాయాన్ని చూస్తే, కోస్తాంధ్ర ఆదాయం రూ.47,937 కోట్లుకాగా, ఖర్చు రూ. 47,253 కోట్లని కోస్తాకు సుమారు రూ.700 కోట్ల మేర కొద్ది పాటు మిగులు ఉందని, మొత్తం రాష్ట్ర ఆదాయంలో కోస్తాజనాభా 40శాతం ఉండగా, రాష్ట్ర ఆదాయంలో 36.51శాతం ఇక్కడ ఖర్చవుతోందని తెలిపారు. రాయలసీమ ఆదాయం రూ. 18,215 కోట్లు కాగా, ఖర్చు రూ. 25,220 కోట్లని, ఇక్కడ లోటు రూ.7,005 కోట్లని, సీమ జనాభా రాష్ట్రం మొత్తంలో 18శాతం ఉండగా, ఆదాయం 14.2శాతం, ఖర్చు 19.5 శాతం ఉందన్నారు. హైదరాబాద్ మినహా తెలంగాణ ఆదాయం రూ.41,391 కోట్లుకాగా, ఖర్చు ఏటా రూ.49,799 కోట్లని, ఇక్కడ లోటు రూ.8,500 కోట్లు ఉందని, రాష్ట్ర ఆదాయంలో 32.45శాతం ఇక్కడ వస్తుండగా, ఖర్చు 38.47శాతం ఉందన్నారు. హైదరాబాద్ నగరంలో ఆదాయం రూ.20,022 కోట్లు కాగా, వ్యయం రూ.7,168 కోట్లని, ఇక్కడ మిగులుగా ఉన్న రూ.12,800 కోట్లు ఉందని, రాష్ట్రం మొత్తం ఆదాయంలోఇక్కడ 16శాతం వస్తుండగా, వ్యయం 5.54శాతం ఉందన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌ను లోతుగా విశ్లేషించి ఏ జిల్లాకు ఆ జిల్లా చొప్పున ప్రాంతాలవారీగా ప్రామాణికంగా రూపొందించిన ఈ నికర ఆదాయలెక్కలన్నిటినీ పరిశీలిస్తే, హైదరాబాద్‌లో మిగులు ఆదాయాన్నే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల లోటును పూడ్చటానికి, ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్టు స్పష్టమవుతోందని జేపీ అన్నారు. ఇప్పుడున్న లెక్కలు, ఉద్యోగుల జీతాల ప్రకారమే ఇలా ఉందని, ఈ వ్యయాలు రాబోయే కాలంలో గణనీయంగా పెరిగే అవకాశముందని అన్నారు. లోటుని పూడ్చుకోవటానికి పూర్వం కేంద్ర ప్రభుత్వం చేసినట్టు కరెన్సీ నోట్లు అచ్చేసుకునే అధికారం కూడా రాష్ట్రానికి లేదన్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర విభజన జరిగితే కొన్ని ప్రాంతాలలో ఏర్పడే లోటును పూడ్చటానికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి ఏర్పాట్లను చేస్తారో ఇప్పుడు అన్ని ప్రాంతాలలో సమగ్ర చర్చ జరగాలని, విభజన బిల్లును ప్రతిపాదించిన కేంద్ర ప్రభుత్వం ఈ ఏర్పాట్ల గురించి అందరితో కూర్చుని పరిష్కారాలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఈ వివరాలేవీ చెప్పకుండా విభజన బిల్లు మీద చర్చ జరపాలనటం హాస్యాస్పదమని, వీటిని తెలియచేయాలని లోక్‌సత్తా పార్టీ ఇప్పటికే రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌కి లేఖ రాసిందని, అయితే వారింకా సమాధానమివ్వలేదని, తాము వివిధ మార్గాల ద్వారా కష్టపడి సొంతంగా ఈ వివరాలను సంపాదించామని జేపీ తెలిపారు. శాసనసభకు, ప్రజలకు తెలియచేయకుండా రహస్యంగా వివరాలు పంపారేమో తనకు తెలియదని, అలా రహస్యంగా పంపాల్సిన అవసరమేమీ ఇందులో లేదని అన్నారు.

రాష్ట్ర శాసనసభకు రాష్ట్రపతి పంపిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై బడ్జెట్‌పై చర్చ జరిగినట్టు మొత్తం బిల్లు మీద సాధారణ చర్చ, ఓటింగ్ ద్వారా అభిప్రాయ వ్యక్తీకరణ, తర్వాత క్లాజులవారీగా చర్చ ఉండాలని జేపీ అన్నారు.

2014 సంవత్సరం తెలుగు ప్రజలకు మేలుకొలుపు కావాలని, తమ జీవితాల్లో సంక్షోభానికి కారణమైన వికృత రాజకీయాన్ని అంతం చేసి సామరస్యతను, అభివృద్ధిని పెంచే, యువతకు ఉపాధిని అందించే కొత్త రాజకీయాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిస్తూ, రాష్ట్రంలోని, దేశంలోని ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడే వారికి జయప్రకాష్ నారాయణ్ నూతన సంవత్సర శుభాకాంక్షల్ని తెలియచేశారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి మారుత్, కార్యదర్శి నందిపేట రవీందర్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ■

# ఆదాయాల లోటును ఎవరు భర్తీ చేస్తారు?

1

**AP State Receipts (2012-13)** ( Rs, in crores)

| | |
|---|---|
| A. State's tax revenue | 59,875.05 |
| B. Non-tax Revenue | 15,999.13 |
| C. (= A+B) State's own revenue | 75,874.18 |
| D. Central taxes share | 20,270.77 |
| E. Central grants | 7,685.33 |
| F. (= D+E) Receipts from Centre | 27,956.10 |
| G. (= C+F) Total Revenue Receipts | 1,03,830.28 |

2

**AP – Total Receipts & Expenditure (2012-13)** ( Rs, in crores)

| | | | |
|---|---|---|---|
| **Receipts** | | | |
| Revenue receipts | | | 1,03,830.28 |
| Public debt & PF receipts | | | 23,310.69 |
| Loans & Advances | | | 425.77 |
| Total Receipts | | | 1,27,566.74 |
| **Expenditure** | | | |
| | Non-plan | Plan | Total |
| Revenue | 77,460.69 | 25,241.69 | 1,02,702.38 |
| Capital | 11.78 | 15,137.05 | 15,148.83 |
| Loans & Advances | 578.50 | 3,334.36 | 3,912.86 |
| Total Expenditure | 85,727.82 | 43,713.10 | 1,29,440.92 |

3

**AP Non-divisible Receipts (2012-13)** ( Rs, in crores)

| | |
|---|---|
| Share of Central taxes | 20,270.77 |
| Central grants | 7,685.33 |
| Market borrowings | 20,000.00 |
| Contra interest | 7,859.96 |
| 0202-Education | 1,195.77 |
| Other AG adjustments | 1,668.00 |
| Total non-divisible receipts | 58,679.83 |

Allocated to the region on 2011 population basis. (40% Coastal Andhra; 18% Rayalaseema; 34% Telangana & 8% Hyderabad)

4

**Receipts & Expenditure - Coastal Andhra (2012-13)** (in crores)

| | Receipts | Expenditure |
|---|---|---|
| Divisible | 24,465.29 | 28,753.74 |
| Non-divisible | 23,471.93 | 18,499.78 |
| Total | 47,937.22 | 47,253.54 |
| % of Total for AP | 37.58% | 36.51% |
| % of divisible to total divisible | 35.52% | 34.56% |

5

**Receipts & Expenditure - Rayalaseema (2012-13)** (in crores)

| | Receipts | Expenditure |
|---|---|---|
| Divisible | 7,653.02 | 16,895.13 |
| Non-divisible | 10,562.37 | 8,324.90 |
| Total | 18,215.39 | 25,220.03 |
| % of Total | 14.28% | 19.48% |
| % of divisible to total divisible | 8.93% | 13.48% |

6

**Receipts & Expenditure – Telangana (2012-13)** (excluding Hyderabad) (in crores)

| | Receipts | Expenditure |
|---|---|---|
| Divisible | 21,440.78 | 34,074.15 |
| Non-divisible | 19,951.14 | 15,724.82 |
| Total | 41,391.92 | 49,798.97 |
| % of Total | 32.45% | 38.47% |
| % of divisible to total divisible | 35.01% | 51.40% |

7

**Receipts & Expenditure – Hyderabad (2012-13)** (in crores)

| | Receipts | Expenditure |
|---|---|---|
| Divisible | 15,327.83 | 3,468.42 |
| Non-divisible | 4,694.39 | 3,699.96 |
| Total | 20,022.22 | 7,168.38 |
| % of Total | 15.70% | 5.54% |
| % of divisible to total divisible | 25.03% | 5.23% |

8

**Region-wise surpluses / Deficits – 2012-13)** ( Rs, in crores)

| Region | Surplus (+) or Deficit (-) |
|---|---|
| Coastal Andhra | + 684 |
| Rayalaseema | - 7,005 |
| Telangana (excluding Hyderabad) | - 8,407 |
| Hyderabad | + 12,854 |
| Total AP | - 1,874 |

# విభజన బిల్లులో రాజ్యాంగ ఉల్లంఘనలు

- **బలవంతంగా విభజిస్తే సమాఖ్య స్ఫూర్తికి దెబ్బ**
- **సామరస్య పరిష్కారానికి చొరవ చూపాలి**
- **రాష్ట్రపతికి లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జేపీ విజ్ఞప్తి**

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లులో రాజ్యాంగ ఉల్లంఘనలు జరిగాయని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ ఆరోపించారు. బిల్లు లోపభూయిష్టంగా ఉందని, రాష్ట్రాన్ని బలవంతంగా విభజిస్తే సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని ప్రాంతాలకు న్యాయం జరిగేలా రాష్ట్ర విభజన ఉండాలని.. మూడు ప్రాంతాల ప్రజా ప్రతినిధుల్ని కూర్చోబెట్టి సమగ్ర సామరస్య పరిష్కారం చూపేందుకు చొరవ చూపాలని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి విజ్ఞప్తి చేశారు. శీతకాల విడిదికి వచ్చిన ప్రణబ్‌ను బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జేపీ కలిశారు. రాష్ట్ర విభజన అంశంతో పాటు కేంద్రం నుంచి స్థానిక సంస్థలకు నేరుగా నిధుల కేటాయింపు, జ్యుడిషియల్ నమిషన్‌కు సత్వరం చట్టబద్ధత కల్పించడం, జడ్జిల నియామకానికి సంబంధించిన ఇండియన్ జ్యుడిషియల్ సర్వీస్ బిల్లుపై చర్చించారు. విభజన బిల్లులో కీలకాంశాల్లో లోపాలున్నాయని రాష్ట్రపతి దృష్టికి జేపీ తీసుకెళ్లారు. విభజన వల్ల రాయలసీమ ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఏటా రూ. 7 వేల కోట్ల రెవెన్యూ లోటు ఉంటుందని వివరించారు. ఆర్థిక వనరుల సమస్య లేకుండా సీమకు ప్రత్యేక ఏర్పాట్లుండాలని అభిప్రాయపడ్డారు. శాసనసభ ఆమోదం తీసుకున్నాకే విభజన బిల్లును పార్లమెంటుకు పంపాలంటూ గతంలో రాష్ట్రపతికి రాసిన లేఖను జేపీ మరోసారి ప్రణబ్‌కు అందజేశారు. అనంతరం పార్టీ నేతలతో కలిసి జేపీ విలేకరులతో మాట్లాడారు.

## సుల్తానుల్లా వ్యవహరించొద్దు

రాష్ట్ర విభజన అంశాన్ని కేంద్రం ఎన్నికల అంశంగా భావిస్తూ ఓట్లు, సీట్ల కోసం చౌకబారు ఎత్తుగడలు వేస్తోందని జయప్రకాష్ విమర్శించారు. ఢిల్లీ పాలకులు సుల్తానులు కాదని, నిర్ణయాలను బలవంతంగా రుద్దితే సమస్యలు పరిష్కారం కావని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల్ని గౌరవిస్తూనే.. రాయలసీమ భవిష్యత్తుకు భరోసా ఉండేలా, కోస్తా ప్రజల హృదయాలు గాయపడకుండా నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి సూచించారు. విభజన బిల్లు ప్రస్తుతం ఆగిపోతే ఇక విభజన సమస్య ఉండదని కొందరు నేతలు భావిస్తుండటం పొరపాటని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు పరిష్కారం లభించకుంటే ఎన్నికల తర్వాత అయినా ఈ సమస్య వస్తుందన్నారు. రాజకీయ పార్టీలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే అందరికీ న్యాయం జరిగేలా పరిష్కరించడం సాధ్యమేనన్నారు. మూడు ప్రాంతాల ప్రయోజనాల్ని రాష్ట్రపతి రక్షిస్తారన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర భవిష్యత్తు ఢిల్లీలో కాకుండా తెలుగు గడ్డపైనే తేలాలని వ్యాఖ్యానించారు. రాష్ట్రాలు వేరైనా ప్రజల మధ్య సత్సంబంధాలుండాలని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టు, హై కోర్టుల్లో జడ్జిల నియామకానికి సంబంధించిన జ్యుడిషియల్ కమిషన్ బిల్లు చట్టంగా మారిన తర్వాత.. ఒకవేళ సుప్రీంకోర్టు ఈ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తే.. దేశ అత్యున్నత న్యాయస్థానాన్ని పార్లమెంటు నిలువరించేలా రాజకీయ పార్టీలన్నీ బాధ్యతాయుతంగా వ్యవహరించడంపై చొరవ తీసుకోవాలని రాష్ట్రపతిని కోరినట్లు జేపీ చెప్పారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో జేపీతో పాటు పార్టీ నేతలు బండారు రామ్మోహన్‌రావు, రవిమారుత్, హైమాప్రవీణ్ ఉన్నారు. ■



**రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో మాట్లాడుతున్న లోక్‌సత్తా అధినేత డా॥ జయప్రకాష్ నారాయణ్**

# ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లుపై చర్చకు ముందు తగిన సమాచారమివ్వాలని స్పీకర్‌కు జేపీ లేఖ

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు – 2013పై అర్థవంతమైన చర్చ జరిపేందుకు వీలుగా బిల్లుకు సంబంధించిన పలు అంశాలపై తనకు, ఇతర సభ్యులకు తగిన సమాచారాన్ని అందించాలని కూకట్‌పల్లి శాసనసభ్యుడు, లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌ను కోరారు. విశేష ప్రాధాన్యత కలిగి, దీర్ఘకాల, ప్రగాఢ పరిణామాలకు దారితీయగల చరిత్రాత్మక మైనదిగా ఈ బిల్లుని జేపీ అభివర్ణించారు.

**ఈ మేరకు స్పీకర్‌కి జయప్రకాష్ నారాయణ్ రాసిన లేఖను లోక్‌సత్తా పార్టీ వర్గాలు మీడియాకు విడుదల చేశాయి. జేపీ లేఖ స్థూల పాఠం...**

*గౌరవ స్పీకర్ గార్కి,*
*ఆంధ్రప్రదేశ్ శాసనసభ*

రాష్ట్ర శాసనసభకు గౌరవ రాష్ట్రపతి పంపిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు – 2013 విశేష ప్రాధాన్యత కలిగిన, దీర్ఘకాల, ప్రగాఢ పరిణామాలకు దారితీయగల చరిత్రాత్మక బిల్లు. అందువల్ల, ఈ బిల్లు మీద చర్చ ప్రారంభించటానికి ముందే, సభ్యులకు పూర్తి సమాచారం అందించి, బిల్లులోని నిబంధనల్ని, సంబంధిత సమాచారాన్ని అధ్యయనం చేసేందుకు తగిన అవకాశం కల్పించాలి. సభ్యులు ఏ రకమైన అర్థవంతమైన అభిప్రాయాలను వ్యక్తం చేయాలన్నా ముందు ఈ కింది సమాచారం తప్పనిసరిగా అవసరం:

1. బిల్లు ఉద్దేశాలు, కారణాల వివరణ.
2. ఆర్థిక వివరాల పత్రం.
3. ఆదాయవ్యయాల పరిస్థితి, హైదరాబాద్ నగరానికి (జీహెచ్ఎంసీ)కి, రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు – కోస్తాంధ్ర, రాయలసీమ, తెలంగాణకు సంబంధించి ఆదాయాలు, గ్రాంట్లు, రెవిన్యూ మరియు ప్రణాళికా వ్యయం వివరాలు.
4. ప్రతి ప్రాంతంలో ఉద్యోగుల వివరాలు – డిపార్ట్‌మెంట్‌లవారీగా ఉద్యోగాల సంఖ్య, ఇప్పుడున్న ఉద్యోగుల సంఖ్య, ప్రాంతంవారీగా, జోన్‌వారీగా వారీగా ఇప్పుడున్న ఉద్యోగుల సంఖ్య, ప్రతి ప్రాంతంలో ఉన్న ఖాళీలు.
5. ఒక్కో ప్రాంతంలో, జీహెచ్ఎంసీ ప్రాంతంలో పింఛను ఖర్చు.
6. ఆస్తుల మదింపు, మేజర్ కార్పొరేషన్ల ఆస్తులు ఎక్కడెక్కడున్నాయో, ఈ కార్పొరేషన్లలో అప్పులు, ఇతర వ్యయాలు ఎంతో వివరాలు.
7. కోస్తాంధ్ర, రాయలసీమ, జీహెచ్ఎంసీ ప్రాంతం, జీహెచ్ఎంసీ ప్రాంతంతో సహా తెలంగాణ ప్రాంతంలో రెవిన్యూ లోట్లు.
8. బిల్లును జాగ్రత్తగా, తులనాత్మకంగా, నిష్పాక్షికంగా పరిశీలించేందుకు కావలసిన సంబంధిత ఇతర వివరాలు.

సభలో బిల్లుపై చర్చను ప్రారంభించేముందు పై సమాచారాన్ని ఒక సభ్యునిగా నాకు, ఇతర సభ్యులకు అందించాలని మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను.” ■



# లోక్‌పాల్ బిల్లు ఆహ్వానించదగ్గదే: లోక్‌సత్తా

కేంద్ర ప్రభుత్వంలోని, పార్లమెంటులోని రాజకీయ నేతల, ఉన్నతాధికారుల అవినీతిని నిరోధించేందుకు బలమైన, స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రభావశీల వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు ఉద్దేశించిన లోక్‌పాల్ బిల్లుని రాజ్యసభలో ప్రవేశపెట్టటాన్ని లోక్‌సత్తా పార్టీ స్వాగతించింది.

2011లో లోక్‌సత్తా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో చేసిన సిఫార్సుల్నే చాలామేర ఈ సవరించిన లోక్‌పాల్ బిల్లులో పొందుపరిచారని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

అయితే ప్రస్తుత రూపంలోని లోక్‌పాల్ బిల్లులో కొన్ని లోటుపాట్లున్నాయని జేపీ పేర్కొన్నారు. ఉదాహరణకి, కొన్ని పార్టీల నుంచి వచ్చిన వ్యతిరేకత వల్ల రాష్ట్రాల స్థాయిలో బలమైన లోకాయుక్తల నియామకానికి సంబంధించిన కొన్ని నిబంధనల్ని ప్రభుత్వం బిల్లు నుంచి ఉపసంహరించుకుందన్నారు.

సామాన్య ప్రజల్ని ఎక్కువగా పీడించే అసలైన అవినీతి రాష్ట్ర, స్థానిక స్థాయిల్లోనే ఉంటుందని, రాష్ట్ర స్థాయిలో బలమైన లోకాయుక్త, జిల్లా స్థాయిలో అంబుడ్స్‌మన్‌ని ఏర్పాటు చేస్తేనే ఆ అవినీతిని నిరోధించగలమని జేపీ అన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి ఒప్పందాన్ని భారత ప్రభుత్వం ఖరారు చేసినందున, రాష్ట్రాల స్థాయిలో బలమైన అవినీతి నిరోధక వ్యవస్థల్ని ఏర్పాటు చేసే అధికారం కూడా కేంద్రానికి ఉందని స్పష్టంచేశారు. అవినీతికి వ్యతిరేకంగా నిబద్ధతతో పోరాడుతున్నవారంతా ఇప్పుడు రాష్ట్రాలలో అవినీతిని కట్టడి చేసేందుకు తమ పోరాటాల్ని ఉధృతం చేయాల్సుందన్నారు.

ప్రభుత్వ సేవల్ని ప్రజలకు హక్కుగా అందించేందుకు, సామాన్య పౌరులకు సేవలు అందించటంలో ఆలస్యమైతే పరిహారం చెల్లించేందుకు ఈ లోక్‌పాల్ బిల్లులో ఏర్పాట్లు లేవని జేపీ అన్నారు. పార్లమెంటరీ కమిటీ విజ్ఞప్తి మేరకు లోక్‌సత్తా రూపొందించిన సర్వీస్ గ్యారంటీ బిల్లు ద్వారా ఈ వైఫల్యాన్ని సరిచేయవచ్చున్నారు. అవినీతిని ఎదుర్కోవటంలో భాగంగా ఈ బిల్లుని కూడా త్వరితగతిన చట్టంగా అమలుచేయాలన్నారు.

అవినీతిపరుల ఆస్తుల్ని జప్తుచేయటానికి లోక్‌పాల్ బిల్లులో ఉన్న నిబంధనలు సైతం అంత పకడ్బందీగా లేవని జేపీ అన్నారు. స్మగ్లర్లు, విదేశీమారకద్రవ్యం ఎగవేతదారుల చట్టం (ఎస్ఎఎఫ్ఇఎంఎ), 1976 తరహాలో న్యాయ కమిషన్ రూపొందించిన బిల్లుని పార్లమెంటులో ప్రవేశపెట్టాలన్నారు.

లోక్‌పాల్ కేసుల్ని విచారిస్తున్న సీబీఐ అధికారుల్ని లోక్‌పాల్ ఆమోదం లేకుండా బదిలీ చేయకూడదని బీజేపీ లేవనెత్తిన అభ్యంతరం సహేతుకమైనదని జేపీ అన్నారు. ప్రభుత్వం ఈ వాదనను అంగీకరించి, అటువంటి బదిలీల విషయంలో లోక్‌పాల్ అంగీకారం తప్పనిసరి చేయాలన్నారు. అయితే, పూర్తిస్థాయి దర్యాప్తునకు ముందు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజా సేవకులు తమ వాదనను వినిపించే అవకాశాన్ని కల్పించే నిబంధనను బీజేపీ వ్యతిరేకించటం తప్పిదమన్నారు. ఇలాంటి ఏర్పాటే లేకపోతే నిజాయతీపరులైన అధికారులు తరచూ అవాంఛనీయ అవమానాలకు గురవుతారన్నారు. ఇలాంటి ఏర్పాటు ఉంటే, సాక్ష్యాలు లేవని తదుపరి విచారణలో కొట్టివేసే కేసులతో లోక్‌పాల్‌పై మితిమీరిన భారం పడే పరిస్థితి కూడా తప్పుతుందన్నారు.

అన్ని పార్టీలూ చేతులు కలిపి లోక్‌పాల్ చట్టాన్ని తీసుకురావాలని జేపీ విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ 2011 సూచించినట్లు, లోక్‌పాల్ నియామకానికి ఉన్నతస్థాయి ప్యానల్‌ను ఏర్పాటు చేసేందుకు సవరించిన లోక్‌పాల్ బిల్లులో వీలు కల్పించారని గుర్తుచేశారు. ఈ ప్యానల్‌లో ప్రధానమంత్రి, స్పీకర్, ప్రతిపక్ష నేత, భారత ప్రధాన న్యాయమూర్తి, ఈ నలుగురిచే నియమించబడ్డ మరో సుప్రసిద్ధ వ్యక్తి ఉంటారన్నారు. సీబీఐ డైరెక్టర్‌ని ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్యానల్ నియమిస్తుందన్నారు. విచారణ, ప్రాసిక్యూషన్‌ల డైరెక్టరేట్ల నియామకానికి ఏర్పాటు ఉందన్నారు.

ప్రస్తుతరూపంలో లోక్‌పాల్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించి దాదాపు ఏడాది కావొస్తోందని, సవరించిన లోక్‌పాల్ బిల్లులో అనేక ఆహ్వానించదగ్గ ఏర్పాట్లను పొందుపరిచినందున ఇంకేమాత్రం ఆలస్యం లేకుండా చట్టం చేయాలని జేపీ కోరారు. ■

# పార్లమెంటు ఆమోదం పొందిన లోక్‌పాల్ స్వరూపం

- కేంద్ర స్థాయిలో లోక్‌పాల్, రాష్ట్ర స్థాయిలో లోకాయుక్తలు ఏర్పాటవుతాయి. రాష్ట్రాలు ఏడాదిలోగా తప్పనిసరిగా లోకాయుక్తను ఏర్పాటు చేయాలి.
- లోక్‌పాల్‌కు ఛైర్మన్, గరిష్ఠంగా 8 మంది సభ్యులు వుంటారు.
- ప్రధాని, లోక్‌సభ స్పీకర్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సుప్రీం ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్రపతి నామినేట్ చేసే ప్రముఖ న్యాయ నిపుణుడితో కూడిన సెలక్షన్ కమిటీ లోక్‌పాల్ ఛైర్మన్, సభ్యులను ఎంపిక చేస్తుంది.
- ప్రధానితో పాటు మంత్రులు, ప్రస్తుత, మాజీ చట్టసభ్యులు, అన్ని కేటగిరీలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు లోక్‌పాల్ పరిధిలోకి వస్తారు. కొన్ని అంశాల్లో ప్రధానిపై వచ్చే ఫిర్యాదుల పరిశీలనకు ప్రత్యేక ప్రక్రియ ఉంటుంది. ప్రధానిపై విచారణకు లోక్‌పాల్ సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది ఆమోదం అవసరం.
- ధార్మిక సంస్థలు, మతపరమైన, సేవా కార్యక్రమాలు చేపట్టే సంస్థలు మినహా విదేశాల నుంచి, కేంద్ర ప్రభుత్వం, దేశ ప్రజల నుంచి నిర్దేశిత పరిమితిని మించి విరాళాలు పొందే సంస్థలు, ట్రస్టులు, సంఘాలు లోక్‌పాల్ కిందకే వస్తాయి.
- అవసరాన్ని బట్టి లోక్‌పాల్ ప్రత్యేకంగా దర్యాప్తు జరిపించి, ప్రత్యేక కోర్టుల్లో విచారణ కూడా చేపట్టవచ్చు.
- సీబీఐకి స్వేచ్ఛ ఉండేలా దాని దర్యాప్తు విభాగానికి ప్రత్యేక డైరెక్టర్ ఉంటారు. దర్యాప్తు అధికారుల బదిలీకి లోక్‌పాల్ అనుమతి అవసరం. సీబీఐకి లోక్‌పాల్ అప్పగించిన కేసులపై పూర్తి అధికారం లోక్‌పాల్‌కే ఉంటుంది.
- అభియోగాలు ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఉద్యోగి వాంగ్మూలం తీసుకున్న తర్వాతే లోక్‌పాల్ నిర్ణయం తీసుకుంటుంది. ఆరు నెలల్లో దర్యాప్తు, 60 రోజుల్లో విచారణ పూర్తి కావాలి. క్రిమినల్ చర్యలు, అవినీతి కేసుల్లో పదేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చు.
- విచారణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ అక్రమాస్తులను లోక్‌పాల్ స్వాధీనం చేసుకోవచ్చు.
- లోక్‌పాల్‌కు తప్పుడు ఫిర్యాదులు చేస్తే ఏడాది వరకు జైలు శిక్షతోపాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధిస్తారు. ■

# అవినీతి నిరోధానికి ఇతర చట్టాలను ఆమోదించాలి

అవినీతి నిరోధానికి 'లోక్‌పాల్'తో పాటు, పౌరులకు ప్రభుత్వ సేవల్ని హక్కుగా ఇచ్చేందుకు 'సర్వీస్ గ్యారంటీ', ఉన్నతస్థాయి న్యాయమూర్తుల నియామకానికి 'జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్' ఏర్పాటు – ఎన్నికల ముందే పార్లమెంటు ఈ మూడు చట్టాలను చేయాలని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ట్విట్టర్‌లో డిమాండ్ చేశారు. ఈ మూడు బిల్లుల రూపకల్పనలో లోక్‌సత్తా ప్రధానపాత్ర పోషించిన సంగతి తెలిసిందే.

## అన్నా హజారేకు మద్దతు

*నిరాహార దీక్షా శిబిరానికి లోక్‌సత్తా పార్టీ బృందం*

కొన్ని లోపాలున్నప్పటికి లోక్‌పాల్ చట్టాన్ని ప్రస్తుత రూపంలో తీసుకొచ్చినప్పటికి, అది విజయమేనని నిరాహార దీక్షను విరమించాలని అన్నా హజారేకు జేపీ విజ్ఞప్తి చేశారు. అన్నాకు మద్దతును ప్రకటించేందుకు, లోక్‌సత్తా వైఖరిని వివరించేందుకు జాతీయ ప్రధాన కార్యదర్శి సురేంద్ర శ్రీవాస్తవ నేతృత్వంలో లోక్‌సత్తా పార్టీ సీనియర్ నేతల బృందాన్ని పంపుతున్నట్టు జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

# అసలు తిరకాసు ఎన్నికల వ్యవస్థదే...

- ఆర్.వి. రామారావు

ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలలో ఒక్క మిజోరం మినహా మిగిలిన నాలుగు రాష్ట్రాలలో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోయింది. అయితే దేశ రాజధాని ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో మాత్రం ప్రజలు కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించినా బిజెపి, ఆమ్ ఆద్మీ పార్టీలలో దేనికీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి తగినంత మెజారిటీ ఇవ్వకపోవడంతో ఫలితాలు వెలువడి పది రోజులౌతున్నా కొత్త ప్రభుత్వం ఏర్పడలేదు. ఎవరికీ మెజారిటీ రానపుడు సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతాయి. కానీ ఢిల్లీలో ప్రత్యక్ష మద్దతుతో కానీ, వెలుపతి మద్దతుతో కానీ ప్రభుత్వం ఏర్పడే అవకాశం కనిపించడం లేదు.

**అభిప్రాయ వేదిక**

అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని పార్టీకి ప్రభుత్వం ఏర్పాటులో మద్దతు ఇవ్వడానికి కాంగ్రెస్ ముందుకు వచ్చినా కేజ్రీవాల్ నిరాకరిస్తున్నారు. ఎవరికీ మెజారిటీ రాని స్థితిలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్ పూర్వోదంతాల ఆసరాగా అతి పెద్ద పార్టీగా అవతరించిన బిజెపిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. కానీ తమకు స్పష్టమైన మెజారిటీ లేనందువల్ల ఆ పని చేయలేమని ఆ పార్టీ తేల్చి చెప్పింది. ఆ తర్వాత నజీబ్ జంగ్ కేజ్రీవాల్‌ను ఆహ్వానించారు. ఎన్నికలు పూర్తైన తర్వాత ప్రభుత్వం ఏర్పాటుకు సకల ప్రయత్నాలూ చేయడం గవర్నర్ విధి. అందులో నజీబ్ జంగ్ ఏ లోపమూ చేయలేదు.

ప్రభుత్వం ఏర్పాటుకు మద్దతు ఇవ్వడానికైనా, తీసుకోవడానికైనా కేజ్రీవాల్ 18 షరతులు విధించారు. ఈ షరతులు నిరాకరించదగినవీ కాదు. ఆయన కోర్కెలు అసంబద్ధమైనవీ కాదు. కాని వాటిని కాంగ్రెస్, బిజెపి కూడా తిరస్కరించాయి. అయినా ఆ షరతులు ప్రస్తుత పరిస్థితుల్లో ఊహా లోకంలో విహరించేవిగానే కనిపిస్తాయి. మన వ్యవస్థ ఉన్న స్థితి అలాంటిదే మరి.

అతిపెద్ద పార్టీగా అవతరించిన బిజెపికి ప్రభుత్వం ఏర్పాటు చేసే శక్తి లేనపుడు కేజ్రీవాల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసి చూపించాలని కోరడం కజ్జాకోరుతనమే. ప్రభుత్వం ఏర్పాటుకు బిజెపికి అవసరమైంది నాలుగు సీట్లే. కేజ్రీవాల్‌కు కావాల్సింది ఎనిమిది సీట్లు. అప్పుడు కేజ్రీవాల్ ఎలా ప్రభుత్వం ఏర్పాటు చేయగలరో బిజెపి ఆలోచించలేదని అనుకోలేం. కాంగ్రెస్ మద్దతుతో ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేస్తే అవినీతి వ్యతిరేక పోరాటయోధుడినని టముకు వేస్తున్న పెద్దమనిషి పచ్చి అవినీతికరమైన కాంగ్రెస్‌తో పొత్తుకూడారు చూశారా? అని దెప్పి పొడవడానికి బిజెపి కేజ్రీవాల్ మీద ఒత్తిడి చేస్తున్నట్టుంది. ఆ పార్టీ రాజకీయ దూరదృష్టి అంత పదునైందనుకోవాలా?

కేజ్రీవాల్ ఇలాంటి షరతులు పెట్టడం ప్రభుత్వ ఏర్పాటు బాధ్యత నుంచి తప్పించుకోవడానికి అనుసరిస్తున్న ఎత్తుగడ మాత్రమేనని రెండు పార్టీలు దుయ్యబడుతున్నాయి. కాంగ్రెస్, బిజెపి రెండూ అవినీతికర పార్టీలే గనక, రెండింటి సిద్ధాంతాలూ ఒకటే గనక ఆ పార్టీల మద్దతు తీసుకోం అన్నది కేజ్రీవాల్ వాదన. కేజ్రీవాల్ సగటు రాజకీయ నాయకుడిగా వ్యవహరించ దలచుకోలేదు. ఆయన నిఖార్సైన వాడినని నిరూపించు కోవాలనుకుంటున్నట్టుంది. మంచిదే కానీ రాజకీయాలు ఎల్ల వేళలా రూళ్ల కర్రల మధ్య ఇమడవు. సాధ్యాసాధ్యాలను పరిగణనలోకి తీసుకోవడం అవసరం. అసాధ్యాన్ని సాధ్యం చేయడం కూడా రాజకీయ విద్యలో భాగమే. తాము చెప్పేది ఎంత మహత్తరమైనదైనా ప్రజలు దానికి అనుగుణంగానే తీర్పు చెప్పాలని బలవంతపెట్టడం ప్రజాస్వామ్యంలో అయితే కుదరదు. కుదరాలనుకుంటే అది ప్రజాస్వామ్యంగా మిగలదు.

ప్రజా తీర్పు తాము ప్రతిపక్షంలో కూర్చోవడానికేననీ, అయినా ఇది చరిత్రాత్మకమైన తీర్పు అనీ, ప్రస్తుత వ్యవస్థతో ప్రజలు విసిగిపోయారనీ, నీతి నిజాయితీలకు కట్టుబడిన రాజకీయాలకు శూన్యత ఉందనీ కేజ్రీవాల్ అంటున్నారు. కానీ అదే నోటితో బిజెపి కాంగ్రెస్‌లో ఊపిరి సలపకుండా ఉన్నవారు ఎవరైనా ఉంటే తమతో చేతులు కలపాలని కూడా

ఆహ్వానిస్తున్నారు. ఎన్నికైన శాసనసభ్యులు కొత్త శాసనసభ ఏర్పడక ముందు పార్టీ మారినా ఫిరాయింపుల చట్టం వర్తించదన్న ధర్మ సూక్ష్మాన్ని కేజ్రీవాల్ బాగానే గ్రహించారు. అక్కడ ఆయన నైతికతకు భంగం కలగడం లేదు కాబోలు. మినహాయింపులతో కూడింది రాజకీయం అవుతుంది గానీ నిఖార్సైన నీతి కాదుగా!.

ప్రభుత్వ ఏర్పాటుకు అనువైన కూడికలూ తీసివేతలు కుదరని పరిస్థితి ఇప్పుడు ఢిల్లీలో ఏర్పడినట్టే, 1960లో కేరళ శాసనసభలోనూ ఎదురైంది. సకల ప్రయత్నాలూ విఫలమైన తర్వాత రాష్ట్రపతి పాలన విధించి ఆ తర్వాత మళ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ఇప్పుడూ అదే పరిస్థితి రాకుండా ఉండాలంటే ఏదో ఒక పక్షం ప్రభుత్వం ఏర్పాటు చేయక తప్పదు. కుదరక పోతే రాష్ట్రపతి పాలన అనివార్యం అవుతుంది. ఎందుకంటే ఎట్టి పరిస్థితిలోనూ శాసనసభ గడువు పొడగించడం కుదరదు. ఆ గడువు డిసెంబర్ 17న ముగుస్తుంది.

మనం అనుసరిస్తున్న మొదట గీత దాటితే వారే విజేతలు అన్న ఎన్నికల విధానం వల్ల వివిధ పార్టీలు సాధించిన ఓట్ల శాతానికి సీట్లకు మధ్యన పొంతన కుదరడం లేదు. ఉదాహరణకు చత్తీస్‌గఢ్ ఎన్నికల ఫలితాలనే పరిశీలిద్దాం. అక్కడ మొత్తం 90 స్థానాలుంటే బిజెపి 49 స్థానాలు సంపాదించి అధికారం నిలబెట్టుకుంది. కాంగ్రెస్ 39 స్థానాలు సంపాదించింది. విచిత్రం ఏమిటంటే ఈ రెండు పార్టీలు సంపాదించిన సీట్ల తేడా పది అయినా ఓట్ల శాతంలో తేడా మాత్రం 0.75 శాతమే. అధికారంలోకి వచ్చిన బిజెపికి ఈ 0.75 శాతం ఓట్ల ఆధిక్యం వల్ల కాంగ్రెస్ కన్నా పది స్థానాలు ఎక్కువ సంపాదించగలిగింది. అంటే 0.75 శాతం ఓట్లు తక్కువ వచ్చినా కాంగ్రెస్ ఏకంగా పది స్థానాలు కోల్పోవాల్సి వచ్చింది.

అలాగే ఢిల్లీలో ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే, 29.6 శాతం ఓట్లు వచ్చిన కేజ్రీవాల్ పార్టీకి 28 సీట్లు వచ్చాయి. 25 శాతం ఓట్లు సంపాదించిన కాంగ్రెస్‌కు 8 సీట్లు మాత్రమే వచ్చాయి. ఓట్ల శాతాన్ని బట్టి సీట్లు వచ్చే పద్ధతి గనక ఉంటే కాంగ్రెస్‌కు 23 స్థానాలు దక్కాలి. కాంగ్రెస్‌కు, ఆమ్ ఆద్మీ పార్టీకి మధ్య ఓట్ల తేడా 5 శాతమే. ఆమ్ ఆద్మీ పార్టీకి, బిజెపి మధ్య ఉన్న వ్యత్యాసం కూడా దాదాపు 5 శాతమే అయినా బిజెపికి 31 స్థానాలు దక్కాయి. ఒక పార్టీ సాధించిన సీట్ల మధ్య వ్యత్యాసం ఆమ్ ఆద్మీ పార్టీకి, కాంగ్రెస్‌కు మధ్యన అదే 5 శాతం అయినా కాంగ్రెస్ 20 సీట్లు కోల్పోయింది. ఆమ్ ఆద్మీ పార్టీతో పోలిస్తే దాదాపు 5 శాతం ఓట్ల తేడా ఉన్న బిజెపికి 20 సీట్లు కాకుండా మూడు మాత్రమే పెరిగాయి. మనం అనుసరిస్తున్న ప్రస్తుత ఎన్నికల విధానం ఓట్లకూ, సీట్లకూ పొంతన కుదరనివ్వనిది.

ఇదే మనం దామాషా పద్ధతి అనుసరిస్తే సీట్ల సంఖ్యలో గణనీయమైన మార్పు కనిపిస్తుంది. నిజానికి దామాషా పద్ధతే ప్రజల తీర్పుకు అసలైన గీటురాయి. దామాషా పద్ధతి అనుసరించి ఉంటే ఢిల్లీలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని దుస్థితి తప్పేది.

బిజెపి, కాంగ్రెస్ దొందూ దొందే అంటున్న కేజ్రీవాల్ ఎన్నికల విధానంలో మౌలిక మార్పులు కోరడం లేదు. సవ్యంగా వ్యవహరించని చట్ట సభల సభ్యులను వెనక్కి పిలిపించాలనే మాట్లు వేయడానికి ఉపకరించే సంస్కరణలు మాత్రమే అడుగుతున్నారు. బిజెపి, కాంగ్రెస్ సిద్ధాంతాలు ఒకటే అంటున్న కేజ్రీవాల్ నీతివంతమైన రాజకీయాలు మీద చూపిన దృష్టి తన రాజకీయ సిద్ధాంత ప్రాతిపదికను విడమర్చడంలో చూపలేదు. ఆయన రాజకీయాలు ఆ రెండు రాజకీయ పార్టీల విధానాల కన్నా ఎలా మెరుగైనవో చెప్పనే లేదు. విధానాలు, సిద్ధాంతాల్లో మౌలికమైన తేడా ఏమిటో ప్రజలకు విడమర్చనే లేదు. అవినీతి రహిత వ్యవస్థను కోరుకోవడం కచ్చితంగా ఆహ్వానించదగిందే అయినా అవినీతి నిర్మూలన ఒక్కటే సకల సమస్యలకు పరిష్కారం చూపదు. ఒకవేళ చూపుతుందనుకున్నా వ్యవస్థలో మౌలిక మార్పులు లేనిదే అదీ అసాధ్యమే అవుతుంది.

రాజకీయ నాయకుల అవినీతికి ప్రధాన కారణం మనం అనుసరిస్తున్న ఎన్నికల విధానమే ప్రధాన కారణం. అందుకే విధానాలు ఎవరికీ ముఖ్యం కావడం లేదు. దామాషా ఎన్నికల వ్యవస్థను అమలు చేస్తే చట్ట సభల స్వభావమూ మారుతుంది. ఎన్నికల్లో డబ్బు వెదజల్లే రుగ్మత చాలావరకు మాయమవుతుంది. పార్టీల విధానాలకు ప్రాధాన్యం దక్కుతుంది. డబ్బు సంచులు, జబ్బపుష్టి ఉన్నవారు చట్టసభల్లో దర్జాగా ఆసీనులయ్యే దురవస్థ నుంచీ బయట పడగలుగుతాం. విధానాలకు ప్రాధాన్యం దక్కినప్పుడు నేరస్థులు చట్టసభల్లో తిష్ట వేసే బెడదా తగ్గుతుంది. దుష్టాంగాన్ని ఛేదించవలసిన సమయంలో కాయకల్ప చికిత్సల వల్ల ప్రయోజనం పెద్దగా ఉండదు. ■

# ఓటర్లకు వజ్రాయుధం-స్వచ్ఛమైన పాలనకు శ్రీకారం!

- ఎ. అన్నపూర్ణ

ఇప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ విజేత కేజ్రీవాల్ పేరు మారు మ్రోగుతోంది. దేశ రాజకీయ పరిణామాల పట్ల విసిగిపోయిన ప్రజలకు ప్రత్యామ్నాయంగా కనిపించారు అరవింద్ కేజ్రీవాల్. ఆయన కేవలం ఢిల్లీకి మాత్రమే పరిమితం అయినా దేశమంతా స్ఫూర్తిని కలిగించారు. మన రాష్ట్రంలో లోక్‌సత్తా పార్టీ నేత జయప్రకాష్ నారాయణ్, కేజ్రీవాల్ కన్నా ముందుగానే స్వచ్ఛంద సంస్థను 1997లోనే ప్రారంభించి ప్రజల్లోకి వచ్చారు. గ్రామగ్రామాల్లోనూ విస్తరించి ఉద్యమాలను నిర్వహించింది. విజయాలను సాధించింది. పది సంవత్సరాల తర్వాత రాజకీయ పార్టీ ఆవిర్భావానికి దారితీసింది. ఇటు మన రాష్ట్రంలో జేపీకి, అటు ఢిల్లీలో కేజ్రీవాల్ ఆశయాలకి పోలిక ఒక్కటే. కనుక సహజంగానే రాష్ట్ర ప్రజల దృష్టి జేపీతో కలిపి ఆలోచన ప్రారంభించింది. 9 నెలల ఆమ్ ఆద్మీ పార్టీ విజయానికి 7 సంవత్సరాల లోక్‌సత్తా పార్టీ ఆవిష్కరణకి జతగా వున్న అంశాలు గురించి తర్కించుకోవడం సామాన్యమైనది.

**అభిప్రాయ వేదిక**

అదే ఢిల్లీలో అన్నా హజారే దీక్ష పూనడం, జన సందోహం ఒకచోట చేరడానికి అవకాశం వచ్చింది. ఆ ప్రజలే కేజ్రీవాల్ వైపు తిరిగి ఆమ్ ఆద్మీ పార్టీకి బలాన్నిచ్చారు. దేశ రాజధాని నగరంలో గత సంవత్సరం జరిగిన నిర్భయ ఉదంతం ప్రజల్లో తిరుగుబాటును తెచ్చింది. ఆగ్రహంతో రగిలిపోయిన ప్రజలు జరుగుతున్న పరిణామాల పట్ల విసిగిపోయిన సమయంలో కేజ్రీవాల్ స్థాపించిన ఆమ్ ఆద్మీ పార్టీ పట్టుకొమ్మ అయింది. అంతే వారు కేజ్రీవాల్ వైపు దృష్టి సారించారు. ఘన విజయాన్ని తెచ్చిపెట్టారు. ప్రభుత్వ విధానాలు సరిగా లేనప్పుడు ప్రజలు సహించరని తప్పకుండా తిరుగుబాటు చేస్తారని, లోక్‌పాల్ బిల్లుకై అన్నాహజారే దీక్ష అంశాన్ని, మహిళలకు, యువతులకు భద్రత కల్పించలేని నిర్భయ విషయంలో విఫలమైన ప్రభుత్వ విధానాన్ని ఉదాహరణగా తీసుకున్నారు.

2007లో ప్రారంభించిన లోక్‌సత్తా పార్టీ అతి సాధారణ పరిస్థితుల్లో బాలారిష్టాలను దాటుకుని ఎదుగుతూ వచ్చింది. ప్రజల్లో చైతన్యం తీసుకురాగల ఎలాంటి అద్భుతాలు కలిసి రాలేదు. చాపకింద నీరులా ప్రవహిస్తూ ఇప్పుడిప్పుడే బలం పుంజుకుంటుంది.

అయితే ఒకే ఒక్క స్థానానికి ఒక్కడుగా కొనసాగుతున్న జేపీలో ఎలాంటి నిర్లిప్తతా కలగలేదు. నిరాశా నిస్పృహలను దరిచేరనీయలేదు. సహచరులతో కలిసి రాబోయే ఈ 2014వ సంవత్సరం ఎన్నికల కోసం రెట్టించిన ఉత్సాహంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు కలిసి పనిచేస్తూనే వున్నారు. ఇదే ఈ పార్టీ ఘనత. పత్రికలు,మీడియాలు, మిగతా పార్టీలు లోక్‌సత్తా అనే పార్టీ వుందని గుర్తించకపోయినా తనవంతుగా కష్టపడుతూ సంతృప్తిగా పనిచేస్తూనే ఉంది. కొన్ని పార్టీలకు ధనమే పెట్టుబడి. అవినీతి ప్రత్యేకత. అక్రమాలు అర్హతలు. అవినీతిరహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని, పేదలకు విద్య, వైద్య, ఆహారం, ఆశ్రయం కల్పించాలని పాటుపడే లోక్‌సత్తా పార్టీని ప్రజలు గుర్తిస్తున్నారు. ప్రతి ఒక్కరూ వజ్రాయుధమనే ఓటు తమ చేతిలోనే వుందని, నిజాయితీకి ఓటమి లేదని, కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు ముందుకు వచ్చి ఓటు నమోదు కార్యక్రమాలను నిర్వహించారు. కొత్తగా నగరానికి వచ్చిన వారు ఓటు నమోదు చేసుకోవడం ఒక ఆశాకిరణం. రాష్ట్రాన్ని బాగుచేసే నిస్వార్థపరులు కావాలా? పదవుల కోసమే ప్రజలను మభ్యపెట్టి ఓటు బ్యాంకును కొల్లగొట్టే నాయకులు కావాలా? ప్రజలకు తెలుసు ఎవరెంతటి ఘనాపాటీలో. ఓటు వేయడం దేశ ప్రజల కర్తవ్యం. అది వృధా చేస్తే అసంఘటిత శక్తులను ప్రోత్సహించడమే అవుతుంది. ఓటు వేయడం అనే కర్తవ్య నిర్వహణ కోసం ఎందరో సామాన్యులు, ఎంత దూరమైనా వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకుంటారు. అంతఃపుర వాసులు అమూల్యమైన ఓటును జారవిడుచుకోవద్దు. అవును ఓటు, ఓటర్ల చేతిలో వజ్రాయుధం. స్వచ్ఛమైన పాలనకు శ్రీకారం కాగలదు. ఇది అక్షరాలా నిజమని నిరూపించడం ప్రజల చేతుల్లో వుంది. కాదంటారా?. ■

# మన రాష్ట్రంలో లోక్‌సత్తా పార్టీని గెలిపించుకోలేమా?

- నక్క సంజీవ్ కుమార్

రాజకీయాలలో కూడా ఒక వ్యక్తి అసాధారణ సామర్థ్యం మీదే ఆధారపడి గెలుపోటములు ఉంటే, ఈపాటికి లోక్‌సత్తా పార్టీ భారతదేశంలోని అన్ని రాష్ట్రాలలో రాజ్యమేలుతూండేది. లోక్‌సత్తా భావజాల సృష్టికర్త, పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఈ దేశానికి అత్యున్నత స్థాయిలో దిశానిర్దేశం చేస్తుండేవారు. కానీ ఓటరుగా, నాయకుడిగా అన్ని చోట్లా జేపీ కనిపిస్తూ సర్వాంతర్యామిలా తన ప్రభావం చూపటం సాధ్యం కాదు కాబట్టే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక్క జేపీ శక్తితో మాత్రమే రాజకీయాలలో మార్పు రాదు. ఇక్కడ మార్పు రావాలంటే, ప్రతి వ్యక్తిలో ఆ స్థాయి ఆలోచన రూపుదిద్దుకోవాలి, అందుకనుగుణంగా కార్యాచరణకు వారు సంసిద్ధం కావాలి. అందుకే ఒక క్రీడాకారునిలాగానో, ఇంకో రంగంలో అసాధారణ విజయాలు సాధించిన వ్యక్తులలాగానో, సాంకేతిక పరిజ్ఞానం బదిలీలాగానో తక్కువ సమయంలో, ఖచ్చితంగా విజయాల్ని సాధించటం రాజకీయాలలో సాధ్యం కాదు. అందులోనూ, ఒక కొత్త భావజాలాన్ని తీసుకుని. అందుకే లోక్‌సత్తా ఉద్యమాన్ని, పార్టీని జేపీ ప్రారంభించినప్పుడు చాలామందిలో భావావేశం, సదభిప్రాయం తప్ప ఒక గొప్ప కార్యాచరణకు తగ్గ దృఢసంకల్పం కనిపించలేదు. అయితే ఇది జరిగితే బాగుండును అనుకున్నవారు చాలా ఎక్కువమందే ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగటం, యువత ఓటర్లుగా పెద్దసంఖ్యలో నమోదు కావటం, అవినీతి ఇక భరించలేని స్థాయికి రావటం, ప్రపంచీకరణతో ప్రజల ఆకాంక్షలు పెరగటం, పట్టణీకరణ వంటి కారణాలవల్ల లోక్‌సత్తా భావజాలం క్రమంగా ప్రాధాన్యతను పొందసాగింది.

**అభిప్రాయ వేదిక**

అవినీతి కట్టడికి బలమైన లోక్‌పాల్ కోసం 2011లో అన్నా హజారే, అరవింద్ కేజ్రీవాల్ తదితరులు దీక్షలు చేయకముందే అలాంటి చట్టం కోసం లోక్‌సత్తా గట్టి ప్రయత్నం చేసిందని, దాంతోపాటు ఇంకా అనేక సంస్థాగత ఏర్పాట్ల కోసం పోరాడుతోందని తెలుగువారిలో చాలామందికి, జాతీయస్థాయిలో పౌరప్రముఖులకు తెలుసు. అయితే పరిస్థితులు ఒక్కసారిగా అనుకూలించటం, ఎక్కువమంది ప్రజలు మాట్లాడే హిందీ ప్రాంతంలో, అది కూడా ఢిల్లీలో జరగటం, మీడియా నభూతో అనేరీతిలో మద్దతివ్వటం వల్ల అన్నా బృందం దీక్షలు గొప్పగా విజయవంతమయ్యాయి. కానీ లోక్‌పాల్ వంటి చట్టం ఎలా ఉండాలో ఆంధ్రప్రదేశ్‌లోని యువత చెప్పగలిగినంత స్పష్టంగా యావత్ భారతదేశంలోని ఏ రాష్ట్రంలోని యువతా చెప్పలేరని మాత్రం ఢంకా బజాయించి మరీ చెప్పవచ్చు. ఎందుకంటే, ఇక్కడ అవినీతికి వ్యతిరేకంగా లోక్‌సత్తా అంత గొప్ప కృషి చేసింది. లెక్కలేనన్ని సభలు, కళాశాలల్లో సమావేశాలకు హాజరై జేపీ అలుపెరగకుండా విద్యార్థులను, యువతను చైతన్యపరిచారు. ఈ మార్పు ఉద్వేగాలకే పరిమితమైంది కాదు, శాశ్వతంగా కొనసాగేది. ఈ నేపథ్యంలో 2013లో ఢిల్లీలో జరిగిన ఎన్నికలలో అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ కొత్త రాజకీయంతో గొప్ప విజయాన్ని నమోదు చేసింది. ప్రధాన జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలను కుదిపేసింది. దీంతో, ఆమ్ ఆద్మీ పార్టీని, లోక్‌సత్తాను పోల్చటం మొదలైంది. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ సాధించిన విజయం, ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సత్తా ఎందుకు సాధించలేదు అని పలువురు ఆలోచిస్తున్నారు, అడుగుతున్నారు. డబ్బు, మద్యం పంచకుండా, ప్రజల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేయకుండా ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో విజయం సాధించటం ఖచ్చితంగా భారతరాజకీయాలలో ఒక గొప్ప మలుపు అనటంలో సందేహం లేదు. కానీ వారి ఎజెండా చాలా పరిమితం. వారి బహిరంగ చర్చ ప్రమాణాలు అభ్యంతరకరం. కాంగ్రెస్, బీజేపీలాగా ఆమ్ ఆద్మీ పార్టీ వారు కూడా తాత్కాలిక తాయిలాలను విసిరి ప్రజలను ఆకర్షించే, మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. దేశ భవిష్యత్తు పట్ల ముందుచూపు లేకుండా వ్యవహరించింది ఆమ్ ఆద్మీ పార్టీ. అయినా కొంచెం ఆశను చూపితేనే ఢిల్లీ ఓటర్లు ఆమ్ ఆద్మీ పార్టీకి పట్టం గట్టారు. కానీ అంతకంటే గొప్ప ఎజెండాతో, రాజకీయ సంస్కృతితో, ఎంతో నిబద్ధతతో పనిచేసిన లోక్‌సత్తాకు మాత్రం తెలుగువారు అధికారం ఇవ్వటానికి మీనమేషాలు లెక్కబెట్టారు. కులం, మతం, ప్రాంతం వంటి భావాలతో, మీకు కండబలం, ధనబలం

లేదు, మీలో గుర్తింపు పొందిన నేతలు లేరు అనే సాకులతో లోక్‌సత్తాకు పెద్దగా ఓట్లు వేయలేదు. ఇప్పుడు కూడా ఆమ్ ఆద్మీ పార్టీ గెలిచింది మీరెందుకు గెలవలేదు అంటున్నారు తప్ప ఓట్లు, సీట్లు లేకపోయినా కూడా లోక్‌సత్తా ఏ రాజకీయ పార్టీ సాధించనంత స్థాయిలో రాష్ట్రంలో, జాతీయస్థాయిలో కీలక సంస్కరణల్ని తీసుకొచ్చింది. లోక్‌పాల్ విజయాన్ని ఎవరెవరికో ఆపాదించినా, దాని వెనక లోక్‌సత్తా ఎంతో కృషి చేసిందనేది అందరి అంతరాత్మలకూ తెలిసిన విషయం, చరిత్రలో నమోదైన నిజం. మనం ఓట్లు వేస్తే లోక్‌సత్తా పెద్ద పార్టీ అవుతుంది, ఆ బాధ్యత మన మీద ఉంది అనే ఆలోచన ఇంకా ప్రజలలో కలగటం లేదు.

లోక్‌సత్తా వేసిన బాటలోనే ఆమ్ ఆద్మీ పార్టీ ఏర్పడింది, గెలిచింది అనటంలో సందేహం లేదు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు సమయంలో కూడా లోక్‌సత్తా తీసుకొచ్చిన సంస్కరణే ఆమ్ ఆద్మీ పార్టీకి అండగా నిలిచింది. ఉదాహరణకి, లోక్‌సత్తా పార్టీలాగే ఆమ్ ఆద్మీ పార్టీ కూడా నిజాయతీగా ఎన్నికల నిధులు సమకూర్చుకోవటానికి 2003లో లోక్‌సత్తా తీసుకొచ్చిన పార్టీల నిధుల సేకరణ చట్టమే ప్రధాన కారణం. ఈ చట్టం ప్రకారం, పార్టీలకిచ్చే నిధులకు పన్ను మినహాయింపు వర్తిస్తుంది. రూ.20,000 దాటిన ప్రతి విరాళం వివరాలూ చెప్పాల్సుంటుంది. ఇప్పటివరకూ ఈ చట్టాన్ని ఆచరణలో చూపుతూ, తన ఆడిట్ చేసిన ఆదాయ వ్యయ వివరాలను ఏటా వెబ్‌సైట్‌లో ఉంచుతున్న పార్టీ భారతదేశంలో లోక్‌సత్తా ఒక్కటే. ఇప్పుడు అదే బాటలో ఆమ్ ఆద్మీ పార్టీ వచ్చింది. అలాగే ఎన్నికలలో పోటీ చేసే వారి వివరాలు విధిగా చెప్పటం, నేరచరిత్రులకు వ్యతిరేకంగా ప్రచారం వంటి మార్పులూ లోక్‌సత్తా వల్లే వచ్చాయి. ఓటరు నమోదుకు ఉన్న ఎన్నో అవరోధాలను అధిగమించి, ఓటరు జాబితాలలో లోపాల్ని సరిచేసేందుకు లోక్‌సత్తా 2004-05లో చేసిన బృహత్ ప్రయత్నాన్నే నమూనాగా తీసుకుని కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాల ప్రక్షాళన చేపట్టింది. ఎన్నికలలో ఓటు వేసేలా ఓటర్లను చైతన్యపరచటం, అందుకు తగిన సంస్థాగత ఏర్పాట్లను చేయటం తమ బాధ్యత కాదు అని చెబుతూ వచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సత్తా కృషి వల్ల ఓటరు జాబితాల ప్రక్షాళనతోపాటు సక్రమంగా ఓటువేసేలా ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమాన్ని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, ఇంటింటికీ వెళ్లి మరీ ఎన్నికల సంఘం ప్రచారం చేయటం వల్ల ఎక్కువమంది ఓటు హక్కును వినియోగించుకున్నారనటంలో సందేహం లేదు. ఇది కూడా ఆమ్ ఆద్మీ పార్టీ విజయానికి ఎంతో ఉపయోగపడింది.

**అభిప్రాయ వేదిక**

ఎన్నికల గుర్తును గుర్తింపు లేని పార్టీలకు కూడా కామన్ సింబల్‌గా ఇవ్వటానికి కూడా సుప్రీంకోర్టు ద్వారా లోక్‌సత్తా చేసిన కృషే కారణం. యువ ఓటర్లు గణనీయంగా పెరగటం, వారంతా ఓటు వేయటం, సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరగటం అనే సానుకూల పరిణామాలకు లోక్‌సత్తా వల్ల వచ్చిన సంస్కరణలు ఒక చట్రంగా ఉపయోగపడి ఆమ్ ఆద్మీ పార్టీ విజయానికి దోహదం చేశాయి. 2013 అసెంబ్లీ ఎన్నికలలో ఢిల్లీలో 65-70 శాతం పోలింగ్ జరగగా, ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా 2008లో హైదరాబాద్‌లో లోక్‌సత్తా పార్టీ ఖైరతాబాద్ ఉప ఎన్నికలో పోటీ చేసినప్పుడు కేవలం 38శాతం పోలింగ్ నమోదైంది. అసెంబ్లీ నియోజకవర్గానికో ఎన్నికల ప్రణాళిక చొప్పున ఈవేళ ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల బరిలోకి వెళ్లి చేసిన ప్రయత్నాన్ని 2009లో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికలలోనే లోక్‌సత్తా చేసి చూపింది. ఇక్కడ వార్డుకో మేనిఫెస్టోని లోక్‌సత్తా రూపొందించింది. అయితే ఈ ఎన్నికలలోనూ కేవలం 44శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. కాబట్టి, ఎన్నో ప్రతికూల పరిస్థితుల మధ్య లోక్‌సత్తా చేస్తున్న కృషికి కొనసాగింపులో భాగంగానే ఆమ్ ఆద్మీ పార్టీ విజయాన్ని అర్థం చేసుకోవాలి. అలాగే ఎన్నికలలో గెలిచాక గోడ మీద పిల్లుల్లా పార్టీలు మారకుండా ఉండేందుకు లోక్‌సత్తా 2003లో తీసుకొచ్చిన పార్టీ ఫిరాయింపుల చట్ట సవరణ కూడా ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీకి ఉపయోగపడింది. ఈ చట్టం వల్ల పార్టీ మారితే సీటు గల్లంతయ్యే నిబంధన ఉండటం వల్ల ప్రభుత్వం ఏర్పాటులో నింపాదిగా ఆమ్ ఆద్మీ పార్టీ వ్యవహరించగలిగింది. ఢిల్లీలో 28 సీట్లు ఆమ్ ఆద్మీ పార్టీ సాధించినా, ప్రభుత్వం ఏర్పాటుకి ఇంకా కనీసం 8 సీట్లు కావాలి. బీజేపీకి 32 సీట్లు ఉన్నాయి. లోక్‌సభ ఎన్నికలు సమీపంలో ఉన్నందున ఏదోకరూపంలో ఫిరాయింపుల్ని ప్రోత్సహిస్తే నష్టపోతామన్న భయం బీజేపీలో ఉండటంతోపాటు, గతంలోలాగా ఆ పనిని అంత సులభంగా చేయటానికి అవకాశం లేని పరిస్థితి లోక్‌సత్తా తీసుకొచ్చిన చట్టం వల్ల ఏర్పడింది. ప్రజాప్రతినిధులెవరైనా పార్టీ మారాలంటే ఇప్పుడు పదవిని కోల్పోవాల్సి ఉంటుంది. కొత్త రాజకీయం దిశగా ఆమ్

ఆమ్ ఆద్మీ పార్టీ కొంతమేర చేసిన ప్రయత్నం సఫలమవటానికి ఇవన్నీ దోహదం చేశాయి. వాటికి తోడు ఢిల్లీలో మాత్రమే ఉండే ప్రత్యేక పరిస్థితులు తోడయ్యాయి.

కాబట్టి, ఆమ్ ఆద్మీ పార్టీ పరిమితుల్ని అర్థం చేసుకుంటూనే ఆ పార్టీ సాధించిన విజయం ప్రాముఖ్యతను గుర్తించటం వాస్తవిక దృక్పథమవుతుంది. సుపరిపాలన, నిబద్ధత గల రాజకీయాలు లేకుండా ఇక ఎన్నికలలో గెలవటం అంత సులువు కాదని ఆ పార్టీ రుజువు చేసింది. రాజకీయాలు అంటే ఎన్నికలు మాత్రమే కాదనేది వాస్తవం. కానీ ఓట్లు, సీట్లు కూడా ముఖ్యమేనని లోక్‌సత్తా ఇంకా బాగా గుర్తెరగాలి. ఆమ్ ఆద్మీ పార్టీలాగా తాత్కాలిక తాయిలాలతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేయకుండానే పేద ప్రజలను చేరేందుకు లోక్‌సత్తా చాలా గట్టిగా ప్రయత్నించాల్సుంది. దిగువస్థాయి ప్రజలను ఎలా చేరాలో ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి లోక్‌సత్తా నేర్చుకోవాల్సిందే. వాస్తవానికి లోక్‌సత్తా ఎజెండా మౌలికంగా పేదరికాన్ని నిర్మూలించేది, పేదల పక్షపాతంతో కూడినది. ఉచితంగా నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు, జనం చేతికి అధికారం, లాభసాటి వ్యవసాయం, చట్టబద్ధ పాలన, స్థానిక న్యాయస్థానాలు, మద్య నియంత్రణ, నూతన రిజర్వేషన్ విధానం, దామాషా ఎన్నికల పద్ధతి వంటివి పేదలకే ఎక్కువగా ఉపయోగపడతాయి. కానీ ఆ పేదలకే పార్టీ భావజాలం బలంగా చేరటం లేదు.

ఎన్నికలలో గెలవకపోతే ఆమ్ ఆద్మీ పార్టీ గురించి పెద్దగా మాట్లాడాల్సిన అవసరం ఉండేది కాదు, కానీ ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా లోక్‌సత్తా పార్టీ గురించి ఏదోకరూపంలో మాట్లాడటం అందరికీ అవసరంగా ఉంటూనే ఉంటుంది. మధ్య, దిగువ స్థాయి నాయకత్వ లోపం లోక్‌సత్తాకు కొట్టచ్చినట్టు కనిపిస్తోంది. అందుకే ఈవేళ ఆమ్ ఆద్మీ పార్టీ విజయం నేపథ్యంలో చేస్తున్న విశ్లేషణల్లోని విమర్శలు నేరుగా జేపీ చుట్టూనే తిరుగుతున్నాయి. లక్షల రూపాయల వ్యయమయ్యే ప్రచారాన్ని కేవలం నామమాత్రపు ఖర్చుతో నిర్వహించేందుకు జేపీ తన అసాధారణ సామర్థ్యం, వ్యక్తిత్వంతో శక్తికి మించి కష్టపడాల్సి రావటం కూడా ఇందుకు కారణం కావచ్చు. కానీ ఇప్పటికైనా నాయకుల్ని తయారుచేసుకోవటం, దిగువస్థాయి ప్రజల్ని చేరుకోవటం లోక్‌సత్తాకు తప్పనిసరి. ఇందుకు పరిస్థితులు కూడా గతంలో కంటే అనుకూలంగా ఉన్నాయి.

కులం, మతం, ప్రాంతం, భాష వంటి దృక్పథాలతో కాకుండా, ఒక పార్టీ అనుసరిస్తున్న విధానాల వల్ల వచ్చే ఫలితాలేమిటి? వాటి సాధనకు అనుసరిస్తున్న పంథా రాజ్యాంగబద్ధంగా ఉందా? అనే రెండు అంశాలనే పరిగణలోకి తీసుకుని మనం ఓటు వేయటం ప్రారంభిస్తే, లోక్‌సత్తా పార్టీ విజయం సాధించగలుగుతుంది.

ఈ నేపథ్యంలో, ఆమ్ ఆద్మీ పార్టీ విజయం, లోక్‌సత్తా పార్టీ మందగమనంపై ఎన్ని విశ్లేషణలు, చర్చలు చేసినా, ఢిల్లీ ప్రజలు డబ్బు, మద్యం తీసుకోకుండా ఆమ్ ఆద్మీ పార్టీని గెలిపించినట్టు మన రాష్ట్రంలో లోక్‌సత్తా పార్టీని గెలిపించుకోలేమా? అని మనల్ని మనం ప్రశ్నించుకుని ఓటు వేయటం, ఆర్థిక బలాన్ని, ఎక్కడికక్కడ తగిన నాయకత్వాన్ని అందించటమే వాటన్నిటి సారాంశమవుతుంది. ■

# మృతిచెందిన భవన నిర్మాణ కార్మికునికి పరిహారం

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మలేషియన్ టౌన్‌షిప్ ఎదురుగా రాజీవ్ సర్కిల్‌లో ఓ.టి.సి. సంస్థ నిర్మిస్తున్న సృజన మాల్‌లో పనిచేస్తున్న సుఖ్‌దేవ్ (24) ఆరవ ఫ్లోర్‌లో లిఫ్టులో గోవకడుతూ ప్రమాదవశాత్తు కిందపడి చనిపోయాడు. ఘటన స్థలానికి చేరుకున్న శాసనసభ్యులు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఘటన స్థలం సందర్శించి సుఖ్‌దేవ్ కుటుంబాన్ని ఓదార్చి ధైర్యం చెప్పారు. భవన నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్‌తో మాట్లాడి రూ. 12 లక్షలు నష్టపరిహారంగా ఇప్పించారు. డిప్యూటీ లేబర్ కమిషనర్‌తో మాట్లాడి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధుల నుండి పరిహారం చెల్లించాలని కోరారు. కార్మికుల భద్రత పట్ల యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భవన నిర్మాణ కార్మికులంతా సంక్షేమబోర్డులో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, అందుకు తాము తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు ఎన్.శ్రీనివాసన్, కొమ్ము సత్తయ్య, ఓంశంకర్, వంశా ప్రసాద్, బాదినేని ప్రసాద్, గంగాభవాని, జీవనలత, యస్.వి.సుబ్బారావు, రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక శాస్త్రాల ఊసేదీ?

- డా॥ మనోహరి వెలమాటి

ఏ సమాజమైనా అభివృద్ధి చెందాలంటే అక్కడ సామాజిక శాస్త్రాల అభివృద్ధి తప్పనిసరి. సామాజిక శాస్త్రాలకు ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత ఇచ్చింది అనే దానిపై అక్కడి సమాజ పురోగతి కూడా ఆధారపడి వుంటుంది. మన చరిత్ర పుటలను చూస్తే సామాజిక శాస్త్రమనేది మానవజాతి అభివృద్ధిలో అంతర్లీనమైన భాగం. అభివృద్ధి చెందిన దేశాల విశ్వవిద్యాలయాలలో సామాజిక శాస్త్ర పరిశోధనా సంస్కృతికి ఎంతో పురాతన చరిత్ర ఉంది. సామాజిక శాస్త్రాలకు ఎందుకు ప్రాధాన్యమివ్వాలంటే వాటి విజ్ఞానం మెరుగైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతుంది. అందరికీ సామాజిక శాస్త్రాల ఉపయోగం కనిపించకపోవచ్చు. ఎందుకంటే వాటి ప్రభావం దీర్ఘకాలంలో కాని తెలియదు. మనం రోజువారీ సమస్యలు ఎదుర్కోవటంలో అతి పెద్ద సవాలు సాంకేతికపరమైనదో లేక మేనేజ్‌మెంట్ సంబంధమైనదో కాదు. ప్రజలు, వారి వైవిధ్య సంస్కృతులు, ఇష్టాలు, ప్రాధాన్యాలు, అవసరాలను డీల్ చేయటమే అతి పెద్ద సవాలు అని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేశాయి. ఇప్పుడున్న ఎన్నో రాజకీయ, సామాజిక సమస్యలకు చారిత్రక రెఫరెన్స్‌తో ఒక అర్థవంతమైన విశ్లేషణను ఇవ్వగలిగినవారు చరిత్రకారులు. పురావస్తు శాస్త్రవేత్తలే లేకపోతే భారతదేశపు మహోన్నత సింధులోయ నాగరికత గురించి ప్రపంచానికి తెలిసి ఉండేదా? స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఎందరో దేశభక్తులు, సమాజహితం కోరుతూ ప్రజలను ఉత్తేజపరిచి పోరాటాలను జరిపిన నాయకులు, రచయితలు సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేసిన వారే. జాతిని ప్రభావితం చేసిన ఎందరో మహానుభావులు నడిచింది సామాజిక శాస్త్రాల బాటలోనే. వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరు, ప్రజల ప్రవర్తనపై పథకాల ప్రభావం– ఈ కోణాలన్నిటినీ సామాజిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తారు. తద్వారా అవసరమైన పథకాలను సూచించి, మెరుగైన సమాజ నిర్మాణానికి దోహదపడతారు. ఒక ఇంజనీర్, సాంకేతిక పరిజ్ఞానంతో ఒక మరుగుదొడ్డి నిర్మాణం చేయగలవచ్చు. కాని దాన్ని సంఘం ఆమోదించేలా చేసి, పారిశుద్ధ్యాన్ని సాధించటానికి కార్యక్రమాలను రూపకల్పన చేసే సామాజిక శాస్త్రవేత్త లేనిదే అభివృద్ధి అసాధ్యం. మానవజాతి ఏ దిశలో ప్రయాణం చేస్తుంది, భవిష్యత్ తరాలు ఏ క్రమంలో ఉండబోతున్నాయని విశ్లేషణ చేస్తూ మానవజాతి లాభపడేలా సంఘాన్ని ఒక త్రాటిపై నడిపించడానికి కృషి చేసేవే సామాజిక శాస్త్రాలు.

కాని ఇప్పుడు పరిస్థితి ఏంటి? మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో మానవీయ, సామాజిక శాస్త్రాలు అంటే చిన్న చూపు. ఒక విశాల దృక్పథంతో శాస్త్రీయంగా సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేద్దామనుకునే విద్యార్థులకు రాష్ట్రంలో చాలా తక్కువ విద్యావకాశాలు ఉన్నాయి. ఉన్న కొద్ది అవకాశాల విషయమై కూడా విద్యార్థులకు అవగాహన లేదు. చాలా కళాశాలల్లో సామాజిక శాస్త్రాలు, పాఠ్యగ్రంథాల పరిజ్ఞానం తప్ప ప్రయోగాత్మక పద్ధతులతో బోధనా విధానాలు లేని తరగతి విద్యగానే పరిమితమయ్యింది. రాష్ట్రంలోని అనేక విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో అర్హతలు లేని అభ్యర్థులు బోధన చేస్తున్నారు. సుశిక్షితులైన విద్యార్థులుగా సంస్థలు వారిని మలచలేకపోతున్నాయి. సామాజిక శాస్త్రాలలో పట్టా తెచ్చుకున్నా సరైనా ఉపాధి అవకాశాలు లేక మళ్ళీ సాఫ్ట్‌వేర్ కోర్సులలోనో, మరే ఇతర రంగంలోనో ఉపాధికి శిక్షణ పొందుతున్నారు. ఈ కోర్సులకు డిమాండ్ తగ్గిపోవడంతో డిగ్రీ స్థాయిలో సైన్సెస్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్స్, అకౌంట్స్ కోర్సులు తప్ప కళాశాలలు సామాజిక శాస్త్రాల ఊసే ఎత్తటం లేదు. విశ్వవిద్యాలయాల్లో పీజీ స్థాయి నుంచి తప్ప బాచిలర్స్ స్థాయిలో కోర్సులు ఉండవు. దూరదృష్టి లేని ప్రభుత్వ విధానాల వల్ల ఇంజనీరింగ్ కళాశాలలు అవసరానికి మించి పెరుగుతూ వచ్చాయి. ఆర్ట్స్ కోర్సులు చతికిలబడ్డాయి. ఈ క్రమంలో సామాజిక శాస్త్ర విద్య ఉనికే ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ఈ పరిస్థితి మారాలంటే ప్రభుత్వం, సమాజం దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి. ఒక ప్రసిద్ధ ఆంగ్ల న్యూస్ మాగజిన్ ప్రతి ఏటా నిర్వహించే సర్వేలో భారతదేశంలోని టాప్ 10 ఆర్ట్స్ కళాశాలల్లో

ఏ ఒక్క కళాశాల ఆంధ్రప్రదేశ్‌లో లేదు. ఢిల్లీ, చెన్నై, కోల్‌కతా, ముంబై మహానగరాలలో బ్రిటిష్ వారి హయాంలో ఏర్పాటైన స్టీఫెన్స్, లయోలా, ప్రెసిడెన్సీ తదితర కళాశాలలే ఇప్పటికీ ప్రముఖంగా కనిపిస్తాయి. మన రాష్ట్రంలో కూడా సామాజిక శాస్త్రాల అధ్యయనం ఎక్కువగా క్రిస్టియన్ కళాశాలల్లో కనిపిస్తుంది. గత ఏడాది హైదరాబాద్‌లో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ శాఖను ప్రారంభించడం ఒక మంచి పరిణామం.

సాఫ్ట్‌వేర్, సెల్‌ఫోన్ టెక్నాలజీ రంగాలలో దేశం రాణిస్తూ ఉండొచ్చు. కాని నిరక్షరాస్యత, అజ్ఞానం, విలువలు లేని విద్యా విధానాలు, బాల్య వివాహాలు, పేదరికం, అనారోగ్యం, పారిశుధ్య లోపం, స్త్రీ వివక్ష లాంటి సామాజిక రుగ్మతలతో బాధపడుతూ సమాజం మానవీయ పురోగతి సాధించలేదు. మనుషులుగా సమాజంలో మనం హీనస్థితిలో ఉండి, ఎంత సాంకేతిక పరిజ్ఞానం పెంచుకున్నా లాభమేమిటి? విలువలు పోయి విద్యా వ్యవస్థ దిగజారుతుంటే దానికి తగిన సూచనలిచ్చి సమాజ నిర్మాణానికి తోడ్పడ గల విద్యావేత్తలు మన రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారు? వివిధ రంగాలలో మహిళలు పురోగమిస్తున్నా రోజూ వారిపై ఆటవికంగా జరుగుతున్న అత్యాచారాలు చూసి అయినా సమాజ రుగ్మతలకు చికిత్స చెయ్యాల్సిన సామాజిక శాస్త్రవేత్తల అవసరం గుర్తుకురావడం లేదా? యాంత్రిక జీవన విధానాలతో ఈ పోటీ ప్రపంచంలో నెట్టుకు రాలేక, తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతూ మనస్తాపం చెందుతున్న యువతకు, పెద్దలకు ధైర్యం చెప్పగల మానసిక శాస్త్రవేత్తలు రాష్ట్రంలో ఎంతమంది ఉన్నారు? ప్రత్యేక రాజకీయ వాదాలతో సామాజికంగా, ఆర్థికంగా కుంటుపడుతున్న రాష్ట్రానికి సరైన పరిష్కార మార్గాలు చూపగల రాజకీయ విశ్లేషకుల కొరత కనిపించట్లేదా? ఇలా చెప్పుకుంటూ పోతే సామాజిక శాస్త్రాల అవసరం, ప్రాధాన్యం మానవ సంబంధాలు ఉన్న అన్ని రంగాలతోనూ పెనవేసుకుని కనిపిస్తుంది. కాని ఆ శాస్త్రాలకు ప్రోత్సాహం లేక, ఒక కొత్త సమాజాన్ని నిర్మించగల ఎందరో గాంధీలను, గురజాడ అప్పారావు వంటి రచయితలను, వీరేశలింగం పంతులు వంటి సంఘ సంస్కర్తలను రాష్ట్రం కోల్పోతుంది.

ప్రస్తుతం మనం పలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాం. మన రాష్ట్రానికి, సమాజానికి ఒక దిశను నిర్దేశించగల ఎందరో యువ సామాజిక శాస్త్రవేత్తల అవసరం చాలా వుంది. మన రోజువారీ జీవితంలో ఎంతో కీలకపాత్ర వహిస్తూ మానవజాతి మనుగడకు అద్దంపట్టే సామాజిక శాస్త్రాలను పునరుద్ధరించాల్సిన సమయం ఆసన్నమయింది. సామాజిక శాస్త్రాలను ఆకర్షణీయ అకడమిక్ ఛాయిస్‌గా అభివృద్ధి చెయ్యాలి. రాష్ట్రంలో ఆర్ట్స్, హ్యూమానిటీస్ సబ్జెక్ట్స్‌ను పునరుద్ధరించటానికి ప్రఖ్యాత సామాజిక శాస్త్రవేత్తలతో కూడిన ఒక కమిటీని నియమించాలి. మానవ వనరుల అభివృద్ధి కార్యక్రమాలలో సామాజిక శాస్త్రాలకు స్పెషల్ కోటా ఇవ్వాలి. విశ్వవిద్యాలయాల్లోని సామాజిక శాస్త్ర విభాగ వ్యవస్థను, వసతులను సంస్కరించాలి. యువ సామాజిక శాస్త్రవేత్తలను సమాజానికి అందించగల వ్యవస్థలుగా ఆర్ట్స్ కళాశాలలకు కొత్త రూపానివ్వాలి. సంబంధిత జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో అకడమిక్ సంబంధాలు పెంపొందించుకోవాలి. ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు అనుబంధంగా ఈ కళాశాలలు పని చెయ్యాలి. రాష్ట్ర ప్రభుత్వం వివిధ సామాజిక శాస్త్ర పరిశోధనా సంస్థలను ప్రారంభించి, వాటికి అవసరమైన నిధులు కేటాయించాలి.

నాలుగు గోడల మధ్య కేవలం లెక్చర్ విధానంతో సామాజిక శాస్త్రాలను బోధించడం శాస్త్రీయ పద్ధతి కాదు. విద్యార్థుల్లో స్వతంత్ర సంక్లిష్ట ఆలోచనా ధోరణి తీసుకు రావటానికి అవసరమైన బోధనా విధానాలను ఉపయోగించని పక్షంలో సామాజిక శాస్త్రాల అధ్యయనం సార్థకం కాదు. సమకాలీన సమస్యలకు సులువుగా అనుసంధానించుకోగల సిద్ధాంతాల, విధానాలకు పాఠ్యాంశాలలో ప్రాధాన్యమిస్తే సామాజిక శాస్త్రాల అధ్యయనం అధిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంటుంది. సామాజిక శాస్త్ర విద్యలో విద్యార్థులకు పరిశోధనా పద్ధతులలో శిక్షణ ఇవ్వటం ఒక కీలక విషయం. ఇంజనీరింగ్, మెడికల్ విద్యార్థులు ఏ విధంగా లాబ్‌లో ప్రయోగాత్మకంగా సబ్జెక్ట్‌ను అధ్యయనం చేస్తారో సామాజిక శాస్త్రాల అధ్యయనం కూడా సమాజమే పరిశోధనాలయంగా సాగాలి. కేస్ స్టడీస్, క్షేత్రస్థాయి విచారణ వంటి బోధనా పద్ధతుల ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణ కూడా అందించవచ్చు.

విశ్వవిద్యాలయాలు, ఆర్ట్స్ కళాశాలలు స్థానిక కమ్యూనిటీతో గట్టి అనుబంధంతో పనిచెయ్యాలి. ఆ ప్రాంత ప్రజల వికాసం, ప్రాంతాభివృద్ధిలో విద్యార్థులకు కీలక బాధ్యత ఇస్తూ వారికి అవసరమైన నైపుణ్యాలు, సామర్థ్యాలు, వనరులను

ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహాయంతో కళాశాలలు పనిచేయగలగాలి. మనదేశం, రాష్ట్రం ఎదుర్కొంటున్న ఎన్నో సమకాలీన సామాజిక, ఆర్థిక సవాళ్ళను ఛేదించడంలో ఈ యువ సంపద ఎంతో ముఖ్యపాత్ర వహించగలదు. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, మహిళా సాధికారత, పర్యావరణం, గిరిజన వికాసం, నేర నియంత్రణ... ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలలో యువ సామాజిక శాస్త్రవేత్తలను విద్యార్థి దశ నుంచి భాగస్వాములను చేసే విధంగా ప్రభుత్వం సంస్థాగత నిర్మాణం చేపట్టాలి. ప్రభుత్వ సంస్థలు/డిపార్ట్‌మెంట్ల కార్యకలాపాలలో యువతను భాగస్వాములుగా చేసి పనిచేస్తే ప్రభుత్వానికి అవసరమైన మానవ వనరులు లభించటంతో పాటూ, సామాజిక అవగాహన, స్పృహ కలిగిన యువతను మనం సమాజానికి అందించవచ్చు. రక్షణ రంగానికి పెట్టే ఖర్చుతో సమాన బడ్జెట్‌ను విద్యకు కూడా ఖర్చు పెట్టాలని స్వతంత్ర భారతదేశ మొదటి విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ సూచించారు. 1964 నాటి కొఠారి కమిషన్ నుంచి నేటి వరకు అనేక విద్యా కమిషన్లు జీడీపీలో ఆరు శాతం విద్యకు కేటాయించాలని సూచించాయి. అందుకు భిన్నంగా కేటాయింపులు తగ్గుతూ వస్తున్నాయి. దేశంలో నాణ్యమైన చదువు అందుబాటులో ఉంటే మంచి చదువుల కోసం ఇతర దేశాలకు వెళ్ళవలసిన అగత్యం ఉండదు. పాతికేళ్ళ లోపు వయస్సు గల 56 కోట్ల యువ జనాభా ఉన్న భారతదేశంలోని యువ వనరులను సమాజాభివృద్ధికి తోడ్పడే వైవిధ్య కోర్సులలో సరైన విద్య-ఉపాధి అవకాశాలతో ప్రోత్సహిస్తే, అది మానవాళి సంక్షేమానికి ఒక గొప్ప ముందగుడు అవుతుంది.

ప్రముఖ అమెరికన్ పాత్రికేయుడు థామస్ ఫ్రైడ్‌మన్ భారత్, చైనాలు ఎదుర్కొంటున్న అత్యధిక జనాభా సమస్యని ప్రస్తావిస్తూ ఇలా అన్నారు : 'ఏ దేశమైతే అంతకంతకూ పెరుగుతోన్న జనాభాను 'డెమొగ్రఫిక్ డివిడెండ్'గా విజయవంతంగా మార్చుకోగలతో ఆ దేశమే 21వ శతాబ్దంలో అభివృద్ధిలో అగ్రగామిగా ఉంటుంది' అలాంటి దిశగా మన ప్రభుత్వాలు అడుగులు వేయాలి. అప్పుడే విద్యార్థులను ఇతరుల అభిప్రాయాలు, హక్కులను గౌరవిస్తూ సామాజిక బాధ్యతతో దేశ సమగ్రాభివృద్ధికి తోడ్పడగల పౌరులుగా తీర్చిదిద్దగలగడం సాధ్యమవుతుంది. ■






# కాపురాలు కూల్చిన మద్యం

**ఒంగోలులో పబ్లిక్ ఎంక్వయిరీ**

'మద్యం మహమ్మరి మా కాపురాలను కూల్చేసింది. మా భర్తలు తాగుడుకు బానిసలై చనిపోయారు. మా కుటుంబానికి అండ లేకుండా పోయింది. మేము బతకలేకపోతున్నాం. బిడ్డలను బతికించుకోలేకపోతున్నాం. మా కాలనీల్లో పిల్లలు కూడా మందు తాగుతూ జీవితాలను పాడుచేసుకొంటున్నారు. ప్రభుత్వం మద్యం మీద ఆదాయం కోసం చూసి మాలాంటి వాళ్ళ జీవితాలను నాశనం చేసే కన్నా ఇప్పటికే ఎన్నో వస్తువుల మీద పన్ను వేస్తున్నారు. అవసరమైతే వాటిపై మరింత పన్నులు పెంచుకొని మద్యం అమ్మకాలు ఆపేస్తే మా జీవితాలు బాగుపడతాయి' అని పలువురు మహిళలు లోక్‌సత్తా నేతల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మద్యం బాధిత వితంతువుల సమస్యలను అధ్యయనం చేసే ప్రక్రియను లోక్‌సత్తా పార్టీ చేపట్టగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు ఒంగోలులోని పలు కాలనీల్లో జిల్లా పార్టీ అధ్యక్షుడు అల్లు శివరమేష్‌రెడ్డి, మహిళా నేత చప్పిడి రత్నకుమారి తదితరులతో కలిసి పర్యటించారు. నగరంలోని ప్రగతి కాలనీ, నల్లవాగు సమీపంలోని కాలనీతో పాటు బైపాస్ రోడ్డులోని డి-ఎడిక్షన్ సెంటర్‌ను సందర్శించారు.

ఈ సందర్భంగా ప్రగతినగర్‌లోని మహిళలతో భేటీ అయ్యారు. సుమారు పది, పన్నెండు మంది మహిళలు అక్కడికి రాగా వారిలో ఆరెడుగురు మద్యం బాధిత వితంతు మహిళలు ఉండటం చూసి లోక్‌సత్తా బృందం ఒకింత ఆశ్చర్యానికి, ఆవేదనకు లోనయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి ఉందని లోక్‌సత్తా నేత కటారి శ్రీనివాసరావు ఈ సందర్భంగా వ్యాఖ్యానిస్తూ వితంతు మహిళల నుంచి వివరాలు సేకరించగా తమ బాధలను

వారు లోక్‌సత్తా బృందం దృష్టికి తెచ్చారు.

■ తన భర్తకు మద్యం తాగే అలవాటు ఉండగా మద్యం తాగి ఆటో నడుపుతూ రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ళ క్రితం చనిపోయాడని నాగరాణి(30) అనే మహిళ తెలిపారు. తమకు పదిహేను ఏళ్ళలోపు వయస్సు ఉన్న ముగ్గురు మగ పిల్లలు ఉండగా వారిని చదివించే స్థోమత లేక పెద్దవారి వద్ద పనికి పంపుతూ కుటుంబం సాగదీస్తున్నామని ఆవేదన చెందారు. రచ్చబండలో ఆర్జీ పెట్టి అధికారుల చుట్టూ తిరిగినా తనకు రూ. 200 ఫించన్ కూడా ఇవ్వలేదని వాపోయారు.

■ తన భర్త వెంకట్రావు కూడా మద్యం తాగి అదే యాక్సిడెంట్‌లో చనిపోయారని అప్పటినుంచి కుమార్తెతో కలిసి ఒక్కదాన్నే జీవిస్తున్నానని అరుణ(30) అనే మహిళ చెప్పారు. ప్రభుత్వం నుంచి రూ. 200 వితంతు పెన్షన్ అందుతున్నా అది దేనికి సరిపోదని, కూలీ చేసుకొంటేనే కుటుంబం గడుస్తుందన్నారు.

■ తన కుమారుడు సింగయ్య మద్యంకు బానిసై ఆరు మాసాల క్రితం చనిపోగా, కోడలు తగవు పెట్టుకొని పట్టించు కోకపోవడంతో తాను దిక్కులేని దానిని అయ్యానని పోలమ్మ(70) అనే వృద్ధురాలు కన్నీరు పెట్టారు.

■ తన భర్త వెంకటేశ్వరరావు మద్యానికి బానిసై లివర్ చెడిపోయి, గుండెపోటు వచ్చి మృతిచెందగా తమ కుటుంబం చిన్నాభిన్నం అయిందని ప్రమీల(36) అనే మహిళ వాపోయారు.

■ తమ కాలనీకి చెందిన గోవిందరాజు మద్యం తాగి ట్రాక్టర్ నడుపుతూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఆయన భార్య సరోజిని కుటుంబం పుట్టెడు కష్టాలతో కాలం వెల్లబుచ్చు తున్నదని మహిళలు చెప్పారు.

## జనవరి 30 : నియోజకవర్గ కేంద్రాలలో ప్రజా సమస్యలపై సామూహిక సత్యాగ్రహం

### వితంతువులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల తమ పార్టీ వితంతు పెన్షన్‌దారులపై నిర్వహించిన సర్వేలో అత్యధిక మంది వితంతువుల భర్తలు మద్యానికి బానిసలై మృత్యువాత పడ్డవారేనని తేలిందన్నారు. ఎక్కువమంది వితంతువుల వయస్సు కూడా తక్కువ వారేనన్నారు. ఈ పరిస్థితికి ముమ్మాటికి ప్రభుత్వమే కారణం కాగా, వారిని ఆదుకొనే బాధ్యతను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయన్నారు. కొంతమందికి రూ.200 వితంతు పెన్షన్ ఇస్తుండగా, మరి కొంతమందికి అది కూడా ఇవ్వడం లేదని దాని వల్ల వారు, వారి పిల్లలు దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. ఈ పరిస్థితులలో మద్యం బాధిత వితంతువులు, వారి కుటుంబాలు కనీస సౌకర్యాలతో బతకాలన్నా వారికి రూ. 3 వేలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారికి రక్షణతోపాటు ఉపాధి కల్పించాలని, వారి పిల్లలను గురుకుల పాఠశాలల్లో చేర్పించి చదివించాలని కోరారు.

### జనవరి 30న ధర్నా

ఈ డిమాండ్ల సాధన కోసం జనవరి 30న కలెక్టరేట్‌ల వద్ద లోక్‌సత్తా ఆధ్వర్యంలో వితంతు మహిళలతో భారీ ధర్నాలు నిర్వహిస్తామన్నారు. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి వారి డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించేదాక పోరాటం కొనసాగిస్తామన్నారు. రాజీవ్ యువకిరణాలు, ప్రజలకు కలుషిత నీటి సరఫరాపై కూడా లోక్‌సత్తా పోరాటం చేస్తున్నదని కటారి చెప్పారు. కటారి పర్యటన సందర్భంగా నగరంలోని పలు కాలనీల్లో సరఫరా అవుతున్న తాగునీటి శాంపిల్స్‌ను ఆ పార్టీ నేతలు సేకరించారు. లాయర్‌పేట మాంటిస్సోరీ స్కూలు ప్రాంతంలో నీటి శాంపిల్స్‌ను కటారి స్వయంగా సేకరించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు వరికూటి అంజనేయులు, రాము, షేక్ రఫీ, రంగారావు, ప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ఒంగోలులో తాగునీటి కాలుష్యంపై లోక్‌సత్తా పోరాటం



నగరంలోని కుళాయిల ద్వారా నగర పాలక సంస్థ సరఫరా చేస్తున్న తాగునీరు పరిశుభ్రంగా ఉందనుకుంటే అంతకంటే పొరపాటు మరొకటి లేదు. గొడుగుపాలెం, జయరాం సెంటర్, గద్దలగుంట, ప్రగతికాలనీ, విరాట్‌నగర్ ఇలా.. ఏ ప్రాంతంలో వస్తున్న నీరైనా కాలుష్యమయమే. ఇది విస్మయకర వాస్తవమైనా నమ్మక తప్పదంటున్నారు లోక్‌సత్తా ప్రతినిధులు. నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరా అవుతున్న తాగునీటిని లోక్‌సత్తా జిల్లా శాఖ ఆధ్వర్యంలో పరీక్షలు చేయించగా, ఇవన్నీ కాలుష్య పూరితమని రుజువైందని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షుడు అల్లు శివరమేష్‌రెడ్డి వెల్లడించారు. నగరంలోని 20 ప్రాంతాలకు పైగా కాలుష్యంతో కూడిన నీరు సరఫరా కావటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి దర్పణం పడుతోందన్నారు. దీనిపై తమ పార్టీ ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు ప్రకటించారు.

**మునిసిపల్ కమిషనర్‌కు మెమోరాండం**

ఒంగోలు నగరంలోని పలు ప్రాంతాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుందని వెంటనే నిలిపివేయాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లు శివరమేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ విజయలక్ష్మిని లోక్‌సత్తా పార్టీ ప్రతినిధులు కలిసి వినతి పత్రం సమర్పించారు. తక్షణమే అధికారులు నీటి పరీక్షలు నిర్వహించి ప్రజారోగ్యం కాపాడాలన్నారు. ఈ సమావేశంలో లోక్‌సత్తా జిల్లా ప్రధాన కార్యదర్శి చప్పిడి రత్నకుమారి, మహమ్మద్ రఫీ, ఎస్.కె.రఫీ, వరికూటి అంజనేయులు, చిరంజీవి, రంగారావు, మారుతీ ప్రసాద్, బాలాజీ ప్రసాద్, మొహతాబ్ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి కాలుష్యంపై లోక్‌సత్తా సర్వే




సనత్‌నగర్ నియోజకవర్గంలోని సనత్‌నగర్, బాల్కంపేట్, అమీర్‌పేట్, బేగంపేట్, రాంగోపాల్ పేట్, బన్సిలాల్ పేట్ మరియు పద్మారావునగర్ డివిజన్‌లలోని చెక్‌లోని శ్యామలకుంట, పద్మారావునగర్, పాటిగడ్డ, హమాలి బస్తీ, జివైఆర్ కాంపౌండ్, సిసినగర్, సింధికాలనీ తదితర ప్రాంతాలలో ఇళ్ళు, పబ్లిక్ స్కూల్‌లలో పాదయాత్ర చేసి మంచినీటి శాంపిల్స్‌ను అధ్యక్షురాలు హైమాప్రవీణ్ నాయకత్వంలో సేకరించడం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు రమేష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హైమాప్రవీణ్, లావణ్య, విమల, జానకిరామ్, రమేష్‌రెడ్డి, మహేష్, త్రివేణి పాల్గొన్నారు.

**జనవరి 30 : ప్రజా సమస్యలపై సామూహిక సత్యాగ్రహం**

# నీటి కాలుష్య పరిశీలనకు శాంపిల్స్ సేకరణ

**ఎల్.బి.నగర్**

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలకు జలమండలి నల్లాల ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో కాలుష్యాన్ని బయట పెట్టేందుకు శాంపిల్స్ సేకరించినట్లు లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ అధ్యక్షుడు దోసపాటి రాము తెలిపారు. నియోజకవర్గంలోని కాకతీయనగర్, శారదానగర్, ఎస్‌టీ హాస్టల్, కొత్తపేట, భవానీనగర్, ఎంసీహెచ్ కాలనీలలో ఇంటింటికి వెళ్లి నల్లాల ద్వారా సరఫరా అవుతున్న నీటి శాంపిల్స్ సేకరించారు. నిజ జీవితంలో వచ్చే రోగాల్లో 60 శాతం రోగాలు నీటి కాలుష్యం ద్వారా వస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఇక్కడి కాలనీలో 90 శాతం కుటుంబీకులు జలమండలి సరఫరా చేసే నీటినే తాగుతున్నారని తెలిపారు. కాగా, మంచినీరు, పారిశుద్ధ్య లోపం వల్ల కలిగే జబ్బులకు, మరణాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. శుద్ధి చేసిన మంచినీరు అందించడంలో మున్సిపాలిటీ నియమ నిబంధనలు–ఉల్లంఘనలపై రౌండ్‌టేబుల్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌లు, ప్రజాసంఘాలతో సమావేశాలు నిర్వహించి చైతన్యపరచాలని నిర్ణయించామన్నారు.

# తాగునీటి నమూనాలు సేకరించిన లోక్‌సత్తా

**మల్కాజ్‌గిరి**

అల్వాల్ సర్కిల్ పరిధిలోని మూడు డివిజన్లలోని మురికి వాడల్లో తాగునీటి నమూనాలను లోక్‌సత్తా పార్టీ కార్యకర్తలు సేకరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మచ్చబొల్లారం, ఓల్డ్ అల్వాల్ ప్రాంతాల్లో పాదయాత్ర చేసి ఈ నమూనాలు సేకరించారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గ్రేటర్ ఇన్‌చార్జి నందిపేట రవీందర్ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన శుద్ధిచేసిన తాగునీరును అందిస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గు చేటన్నారు. తాము ఇంతవరకు సేకరించిన అన్ని ప్రాంతాల్లో తాగునీరు కలుషితమైనదని, కొన్ని ప్రాంతాల్లో వ్యాధికారక క్రిములు కూడా ఉన్నాయన్నారు. అల్వాల్ పరిధిలో కూడా తాగునీరు కలుషితమై ఉందని చెప్పారు. వెంటనే ప్రచారాన్ని మానుకోని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే తాగునీరును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మల్కాజ్‌గిరి ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌వర్మ, ప్రవీణ్‌గౌడ్, మురళీధర్, పవన్‌కుమార్, రవీందర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లి మున్సిపాలిటీలో నీటి పరీక్షలు



లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లి మున్సిపాలిటీలో వివిధ వార్డులలో కుళాయిల దగ్గర స్థానిక ప్రజలతో విలేకరుల సమక్షంలో మంచినీటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన అన్ని ప్రాంతాల్లోనూ నీరు కలుషితమైనట్లు తేలింది. ఈ పరీక్షల వివరాలను మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణకు అందజేయటం జరిగింది. తక్షణమే శుద్ధిచేసిన మంచినీరు అందించడానికి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు వేలం నూకరాజు, ఎవియన్.ప్రకాష్, యం.భాస్కర్‌రావు, కె.రవికుమార్, కె.చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# శృంగవరపు కోటలో కలుషిత మంచినీరు



శృంగవరపుకోటలో మంచినీటి పరీక్షలు నిర్వహించగా, శ్రీనివాసకాలనీలో కుళాయిల ద్వారా అందిస్తున్న నీరు కలుషితమైనదని తేలింది. ఈ సమస్యపై ఆ కాలనీలో జరిగిన సమావేశంలో నియోజకవర్గ నాయకులు డి.సూర్యరావు మాట్లాడుతూ ఈ కలుషిత నీరు తాగితే డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వస్తాయని ఈ సమస్య పరిష్కరం అయ్యే వరకు కాచిన నీరు తాగాలని సూచించారు. వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నట్లు ప్రకటనలే తప్ప ఏ డబ్బు అవినీతి పరుల జేబుల్లోకి పోతుందని దుయ్యబట్టారు. ఆ కాలనీకి సంబంధించిన మహిళలు గోపి రామలక్ష్మి, సిహెచ్.భారతి, కొరివాడ పరదేశమ్మ తదితరులు మాట్లాడుతూ స్వచ్ఛమైన మంచినీరు అందించవలసిన అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని, పన్నులు మాత్రం గుంజుతున్నారని విమర్శించారు. తక్షణమే ఈ సమస్యను మండల జిల్లా అధికారులు పరిష్కరించకపోతే అందరూ కలిసి ఉద్యమాలు చేపడదాం అని లోక్‌సత్తా నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో బి.రామలక్ష్మి, యం.కామేశ్వరి, ఎ.పద్మాకర్, సీనియర్ నాయకులు దాసు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి పట్టని మహిళల భద్రత




సనత్‌నగర్

నిర్భయ ఉదంతం జరిగి ఇప్పటికి 365 రోజులు గడుస్తున్న మన రాష్ట్రములో మండలానికి ఒకటి చొప్పున కనీసం 1100 కొత్త కోర్టులు కావాల్సి వున్న ఇప్పటివరకు లేవని హైమాప్రవీణ్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామా న్యాయాలయాల చట్టం లోక్‌సత్తా ఉద్యమంతో తీసుకొచ్చినప్పటికి, అది అమలుకు నోచుకోకపోవడం అది మన ముఖ్యమంత్రి చిత్త శుద్ధిని తెలియజేస్తోందని లావణ్య ధ్వజమెత్తారు. మహిళలను ఓటు బ్యాంకులుగానే చూశారు గానీ, ఏనాడూ వారి భద్రతపై దృష్టి పెట్టలేదని మహిళా నాయకురాలు భవాని అన్నారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా నాయకులు అమీర్‌పేట కూడలిలో ప్లకార్డులను పట్టుకొని ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సనత్‌నగర్, జూబ్లిహిల్స్, కూకట్‌పల్లి, గ్రేటర్ హైదరాబాద్ విభాగం మరియు భవాని, రమాదేవి, కస్తూరి, లావణ్య, విమల, గంగభవాని, రామ, జానకిరామ్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం




అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం ఘనంగా జరిగింది. స్థానిక పాతబస్తీలో అంబేద్కర్ విగ్రహం ఎదుట లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా లోక్‌సత్తా జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌జి. శంకర్ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ చీపురు గుర్తుతో అవినీతిని ఊడ్చి పడేసిందన్నారు. మన రాష్ట్రంలో లోక్‌సత్తా పార్టీ ఈల వేసి అవినీతిని పారదోలుతుందన్నారు. విద్యార్థి దశ నుంచి చిన్న పిల్లలకు దేశంలో జరిగే అవినీతి గురించి తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ మహిళా అధ్యక్షురాలు టి.రాజ్యలక్ష్మి, లోక్‌సత్తా పట్టణ కోశాధికారి వి.వెంకటేశ్వర్లు, లాయర్ బాబుసాహెబ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓంప్రకాష్, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# తిరుపతిలో లోక్‌సత్తా పార్టీ ర్యాలీ



మన భారతదేశ రాజధాని ఢిల్లీలో అవినీతికి వ్యతిరేకంగా ఎలా మార్పు తీసుకొచ్చారో అదేవిధంగా అన్ని ప్రాంతాలలో, అన్ని రాష్ట్రాలలో అదేవిధంగా మార్పుకు నాంది పలికితే తప్ప మనకు, మన భారతదేశానికి అభివృద్ధి సాధ్యపడదని, ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు మంచి భావాలు గల వ్యక్తులకు, పార్టీలకు మద్దతు తెలుపుతూ వారికి అండదండలుగా నిలవడమనేది ప్రజల బాధ్యతని పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు బెల్లంకొండ సురేష్ నిర్వహించిన ర్యాలీలో అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలసుబ్రమణ్యం, మదనమోహన్, బాలకృష్ణ, జయరాజ్, మునిచంద్ర, కిరణ్, రాఘవరెడ్డి, జీడి నాయుడు, శేషాద్రి, శివ, విక్రమ, ఎ.పి.నాయుడు, ప్రభాకర్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి పార్టీలకు ఢిల్లీ ఫలితాలు గుణపాఠం

**ఒంగోలు**

సంప్రదాయ అవినీతి రాజకీయ పార్టీలకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు గుణపాఠమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా ఒంగోలు వచ్చిన ఆయన పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ట్రంకురోడ్డులోని రాజ్యాంగ నిర్మాత డా॥ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కటారి మాట్లాడుతూ రానున్న రోజుల్లో లోక్‌సత్తా పార్టీ అవినీతిమయమైన సంప్రదాయ రాజకీయ పార్టీలకు స్వస్తి పలికే దిశగా ప్రజలను కార్యోన్ముఖులను చేసేందుకు సరికొత్త ప్రణాళికలను రూపొందించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అల్లు శివరమేష్‌రెడ్డి, మహమ్మద్ రఫీ, రాధాదేవి, రత్నకుమారి, ఎస్‌కె జిలానీ, వరికూటి ఆంజనేయులు, జానకీరామ్, రంగారావు, ప్రసాద్, కిరణ్ పాల్గొన్నారు.

# వీస్తున్నగాలి, సూర్యుని వెలుగు తప్ప మిగతాదంతా అవినీతి




అవినీతి వ్యతిరేక దినోత్సవం సదర్భంగా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి వినతి పత్రాన్ని సమర్పించి ప్రతిజ్ఞ చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మక్కెన అంకయ్య చౌదరి మాట్లాడుతూ అవినీతి నిరోధానికి మూడంచెల వ్యవస్థని లోక్‌సత్తా ప్రతిపాదించింది. ఒకే చట్టంలో దేశానికి లోక్‌పాల్, రాష్ట్రాలకు లోకాయుక్త, స్థానిక సంస్థలకు అంబుడ్స్‌మన్ వ్యవస్థను ఏర్పాటు చేసి, సత్వరంగా పరిష్కారాలు చేసి అవినీతికి పాల్పడ్డ వారి ఆస్తులు జప్తు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తేనే అవినీతి అంతమవుతుందన్నారు. ప్రజలందరూ సమాచార హక్కు చట్టం, పౌర సేవల హక్కు చట్టాలను ఉపయోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బాధ్యులు యం.యస్. మణియాదవ్, సి.పి.బాబురావు, యస్‌డి.రసూల్, యస్‌కె. ఇస్మాయిల్, నగర బాధ్యులు యన్.నరసయ్య, పి.వి.యల్. రవికుమార్, రవీంద్రచారి, క్రిష్ణవేణి, యం.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయాల్లో మార్పు తేవాలి




లోక్‌సత్తా పార్టీ భావజాలం పట్ల, సిద్ధాంతాలపట్ల, నీతివంతమైన రాజకీయం కోసం నిబద్ధతో చేస్తున్న కృషికి ఆకర్షితులై వై.వి.కిషోర్, కె.నవీన్, బి.సురేష్ ఆధ్వర్యంలో యువకులు బి.శివ, పి.కిషోర్, పి.చిరంజీవి, యం.సందీప్, యస్‌కె.ఉస్మాన్, బి.ముని సురేష్, ఎస్‌డి.తాజ్‌ఉద్దీన్, యన్.భూపాల్‌రెడ్డి, సి.రవికుమార్‌లు జిల్లా పార్టీ కార్యాలయంలో లోక్‌సత్తా పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు మక్కెన అంకయ్య చౌదరి మాట్లాడుతూ యువత రాజకీయాలలో మార్పు తీసుకోని రాగలరని, ప్రస్తుతం యువత రాజకీయాల్లో ప్రవేశించి నాయకత్వ లక్షణాలు అలవరచుకొని బాధ్యతలు తీసుకొని రాజకీయాల్లో మార్పు తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ బాధ్యులు యం.యస్.మణియాదవ్, సి.పి.బాబురావు, యస్.రసూల్, నెల్లూరు నరసయ్య, కె.రామారావు, రూరల్ ప్రధాన కార్యదర్శి పి.వి.ఎల్.రవికుమార్, జి.శరత్‌కుమార్, కృష్ణవేణి, రవీంద్రచారి, చిన్నికృష్ణ, చిక్కా రవి, బి.రవి తదితరులు పాల్గొన్నారు.

# యువత ఓటుతో.. అవినీతి అంతం




ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవడంతో పాటు విధిగా వినియోగించుకున్నప్పుడే అవినీతిని పారదోలడంతో పాటు మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉందని లోక్‌సత్తా గ్రేటర్ అధ్యక్షులు దోసపాటి రాము యువతకు ఉద్బోధించారు. ఓటరుగా నమోదు ఓటు హక్కు వినియోగించుకోవడం అనే అంశంపై కొత్తపేటలోని శివానీ మహిళా డిగ్రీ కళాశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నాయకుల భవితవ్యాన్ని తేల్చేది ఓటేనన్నారు. ఈ ఆయుధంతో మంచి లక్షణాలు ఉన్న నాయకుడిని ఎన్నుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో యువత పాత్ర కీలకమని, ఓటు విలువను తెలుసుకోవాలని అన్నారు. వజ్రాయుధం లాంటి ఓటును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. అందుకు ముందుగా 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు విధిగా తమ ఓటును నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా ఎల్‌బీనగర్ ఇన్‌ఛార్జి జె. శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అవినీతి దిష్టి బొమ్మ దగ్ధం




లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకోని, పార్టీ కార్యకర్తలు, నాయుడు పార్టీ కార్యాలయం నుంచి జడ్‌పి సెంటర్ వరకు అవినీతి వ్యతిరేక ప్రదర్శన నిర్వహించారు. అనంతం దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బాణోతు భద్రునాయక్, పార్టీ కార్యకర్తలు, నాయకులు మాట్లాడుతూ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకోని అవినీతి నిర్మూలనకు, సుపరిపాలన సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలకంటే భిన్నంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీలో అధికారానికి అత్యంత చేరువలో రావడం అవినీతి వ్యతిరేకంగా ఉద్యమించడమేనని గుర్తు చేశారు. రానున్న కాలంలో ప్రజలు స్వచ్ఛమైన రాజకీయాలు నడిపే పార్టీలకే పట్టం కడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఎల్.పుల్లారావు, సహాయ కార్యదర్శి వి.లక్ష్మినరసింహారావు, బిసి సెల్ కన్వీనర్ డి.రవీందర్, యువసత్తా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాయితేజ, టి.ప్రసాద్, ఎస్‌సి సెల్ కన్వీనర్ ఈ.రాంబాబు, పాలేరు నియోజకవర్గ కన్వీనర్ యస్.ఉపేందర్, నాయకులు జె.రవి, వెంకట్‌యాదవ్, రమేష్, వెంకన్న, లక్ష్మణ్, వై.ఉపేందర్, యస్‌కె.రహీం, కె.రామారావు, శ్రవణ్, శ్రీశైలం, బి.క్రాంతి, హరి, కిషన్ పాల్గొన్నారు.

# లోక్‌సత్తా బలోపేతానికి మహిళలు కృషి చేయండి!




దిగువ స్థాయి కేడర్ నుండి పార్టీని బలోపేతం చేయడానికి పార్టీలో సభ్యత్వమున్న ప్రతి మహిళా కార్యకర్త కృషి చేయాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ మహిళాసత్తా సమావేశంలో పిలుపు నిచ్చారు. అక్కయ్యపాలెం, సిటి కార్యాలయంలో జరిగిన మహిళాసత్తా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాబ్జీ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి మహిళా డా॥ జయప్రకాష్ నారాయణ్‌కు మద్దతు పలకటానికి సిద్ధంగా ఉన్నారని, అందరిని ఒక దరికి చేర్చి పార్టీ అభివృద్ధికి కృషి చేయవలసిన అవసరం మహిళాసత్తా కార్యకర్తలపై ఉందని ఆయన అన్నారు. పరిపాలనలో ఎవ్వరున్నా మహిళలకు ఎటువంటి అభివృద్ధి చెందే మార్గాలు చూపలేదని, కేంద్రంలో "మహిళా బిల్లు" తీరుచూసి మనం అర్థం చేసుకోవచ్చని ఆయన ఎద్దేవా చేశారు. మహిళాసత్తా నియోజకవర్గ అధ్యక్షురాలు టి.ప్రశాంతి మాట్లాడుతూ మహిళలపై అనేక చోట్ల దాడులు పెరిగిపోతున్నా పాలకులు ఏమీ చెయ్యలేని స్థితి నెలకొందని, అన్నిచోట్ల మహిళలు దగాపడుతున్నారని, లోక్‌సత్తా పార్టీ మహిళాసత్తా ద్వారా పార్టీని అభివృద్ధి చేసేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తారని, వార్డుల్లో మహిళాసత్తా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షులు నాయుడు వేణుగోపాల్, ఉత్తర అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్.మూర్తి, ఈ.సర్వలక్ష్మి, యస్.దుర్గాదేవి, ధనలక్ష్మి, ఎస్.నూర్జహాన్, మంగేశ్వరి పాల్గొన్నారు.

# రాజకీయానికి కొంత సమయం కేటాయించండి




రాష్ట్రంలో జరుగుతున్న వ్యాపార, వారసత్వపు రాజకీయాలను యువత పట్టించుకోవలసిన సమయం ఆసన్నమైందని, చదువుతో పాటు రాజకీయాలను యువత పట్టించుకోవాలని లేకుంటే ఎంత గొప్పగా చదువుకున్నా వ్యవస్థ పతనమైపోతే ఏమీ చేయలేమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి భీశెట్టి బాబ్జీ అన్నారు. అక్కయ్యపాలెం పార్టీ కార్యాలయంలో యువసత్తా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే ఎన్నికలు యువత భవిష్యత్తుని నిర్దేశించేవని, అందుకే యువత రాజకీయానికి కొంత సమయం కేటాయించి లోక్‌సత్తా పార్టీ అధినేత డా॥జయప్రకాష్ నారాయణ్‌తో కలిసి అడుగు వేయాలని, మంచి రాజకీయాలకు మద్దతు కూడగట్టాలని ఆయన అన్నారు. యువసత్తా నియోజకవర్గ అధ్యక్షుడు డా॥నవీన్ మాట్లాడుతూ పెచ్చుమీరుతున్న అవినీతితో యువత తమకున్నా మంచి అవకాశాలు కోల్పోతున్నారని, అన్నిచోట్ల రాజకీయ వ్యవస్థ జోక్యంతో యువత నలిగిపోతున్నారని, ఇంత పెద్ద సంఖ్యలో యువత లోక్‌సత్తా పార్టీలో చేరడం అభినందనీయమని, పార్టీ ప్రచార కార్యక్రమాలను వార్డుల్లో రూపొందిస్తామని అన్నారు. నగర అధ్యక్షుడు నాయుడు వేణుగోపాల్, ఎం.ఎస్.ఎన్.మూర్తి, గొట్టిపాటి సాంబశివరావు పార్టీలో చేరిన యువతను అభినందించారు.

# కలెక్టర్ హామీతో శ్యామలకుంట వాసుల దీక్షలకు విజయం

**సనత్‌నగర్**

బల్కంపేట డివిజన్ శ్యామలకుంట బస్తీ వాసులకు న్యాయం జరిగే వరకు కలిసి పోరాడాలని రాజకీయ పార్టీలు తీర్మానించాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించాయి. చివరివరకూ వారికి అండగా ఉండి వారికి అనుకూలమైన నిర్ణయం వచ్చేవరకూ అండగా ఉండాలని నిర్ణయించాయి. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ వచ్చి గుడిసెవాసులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బస్తీవాసులు గత నెలరోజులుగా చేస్తున్న రిలే నిరాహారదీక్షను విరమించారు. అన్ని పార్టీ నేతలు కలిసి వారితో దీక్షలను విరమింపజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వివిధ పార్టీల నాయకులు వారికి అండగా నిలుస్తున్నట్టు ప్రకటించారు. లోక్‌సత్తా నాయకురాలు హైమాప్రవీణ్ మాట్లాడుతూ బస్తీవాసుల పోరాటం అన్ని పార్టీల నాయకులను కదలించిందన్నారు. 35/15 రాజీవ్ అవాస్‌యోజన పథకం కింద బస్తీవాసులందరికీ ఇళ్లు నిర్మించాలన్నారు.

# సమస్యను పట్టించుకోని పాలకులు

**జూబ్లీహిల్స్**

ముఖ్యమంత్రి ఛైర్మన్‌గా ఉన్న జలమండలి విభాగంలోనే ఇన్ని సమస్యలున్నాయంటే ఇతర విభాగాల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిమారుత్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజక వర్గంలోని పలు ప్రాంతాలలో లోక్‌సత్తా పార్టీ నాయకులు పర్యటించి మంచినీటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా రవిమారుత్ మాట్లాడుతూ వెంగళరావునగర్, ఎర్రగడ్డ, రహ్మత్‌నగర్, బోరబండ, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిలోని పేదలు నివసించే బస్తీలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించటంలో పూర్తిగా విఫలమైందన్నారు. లోక్‌సత్తా పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షులు సాంబిరెడ్డి, ఉపాధ్యక్షులు అన్నపూర్ణ, నాయకులు సుధాశేఖర్, ఉమారాణి, విజయలక్ష్మి, చెన్నమ్మ, ఇందిరా, వి.వి.రాజు, హసన్, అప్పారావు, మోసిన్ కొండలరెడ్డి పాల్గొన్నారు.

# ప్రయివేటు వాహనాలకు అద్దెను వెంటనే చెల్లించాలి

**విజయనగరం**

వాహనాల అద్దెను ప్రభుత్వం పెంచకపోతే, ప్రభుత్వం డిపార్టుమెంటులకు అద్దె వాహనాలు తిప్పడం కష్టమవుతుందని, కొన్ని డిపార్డుమెంటులో అధికారులే తమ స్వంత వాహనాలను తిప్పి జిల్లాలో డ్రైవర్ల పొట్ట కొడుతున్నారని అటువంటి వారి వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్ కాంతిలాల్ దండే దృష్టికి తీసుకువెళ్లాలని, గవర్నమెంటు హైర్ వెహికల్స్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ తీర్మానించింది. సంస్థ కార్యాలయంలోని అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యంలోని కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు బి.చిరంజీవి, బుచ్చి మాట్లాడుతూ చాలా డిపార్టుమెంటుల్లో సక్రమంగా బిల్లులు చెల్లించక పోవడం వలన డ్రైవర్లు, ఓనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎప్పటికప్పుడు పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ వలన వాహనాలు తిప్పడం కష్టమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, కె.రాము, వి.చంద్రమోహన్, టి.నర్సింగరావు, నాయుడు, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళంలో లోక్‌సత్తా నియోజకవర్గ కార్యాలయం



లోక్‌సత్తా పార్టీతోనే విలువైన రాజకీయాలు సాధ్యమని ఆ పార్టీ ప్రతినిధులు అన్నారు. పట్టణంలోని అరసవల్లి రోడ్డులో డీసీఎంఎస్ కార్యాలయానికి చేరువలో శ్రీకాకుళం నియోజకవర్గ కార్యాలయాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.పోలినాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గ అధ్యక్షుడు వి. అప్పలరాజు, పార్టీ ప్రతినిధి ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి మాట్లాడుతూ అవినీతిరహిత పాలన, గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు బి.జగదీష్, టి.మాధవరావు, ఎం.సత్యనారాయణ, ఎ.నాగేశ్వరరావు, ప్రవీణ్, ఎస్.రమణ, నూతన్, గోపాల్, సిటిజన్ ఫోరం అధ్యక్షుడు బి.కామేశ్వరరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంగళగిరిలో లోక్‌సత్తా పార్టీ పౌరసేవా కేంద్రం

గుంటూరు జిల్లాలోని మంగళగిరిశాఖనందు లోక్‌సత్తా పార్టీ పౌరసేవా కేంద్రంను ఏర్పాటు చేశారు. సత్వర పౌర న్యాయం పొందుటకు, వారికి కావలసిన వివిధ చట్టాల పరిజ్ఞానంతో ఈ లోక్‌సత్తా పార్టీ పౌరసేవా కేంద్రాన్ని, మంగళగిరి–వడ్లపూడి సెంటర్ (నాలుగు రోడ్లకూడలి)లో లోక్‌సత్తా పార్టీ ఆఫీసులో లోక్‌సత్తా పార్టీ పౌర సేవా కేంద్రాన్ని ప్రారంభించింది. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని చట్టాలలో వున్న వివిధ సమస్యలను, సలహాలను ఈ లోక్‌సత్తా పార్టీ పౌరసేవా కేంద్రం ద్వారా తెలుసుకొనవచ్చును.

***లోక్‌సత్తా పార్టీ, గుంటూరు జిల్లా, మంగళగిరి శాఖలోని కార్యవర్గ సభ్యులు*** (ఎడమ నుండి కుడికి)

**శివారెడ్డి** (ఆర్.టి.ఐ.)

**కె.వి.యస్. కోటేశ్వరరావు** (ఉపాధక్షులు)

**బుల్లా వేణు** (అధ్యక్షులు)

**అవ్వారు బాలాజి** (కార్యదర్శి)

**ఎల్.నాగమణ** (ఉపాధ్యక్షురాలు)

**మస్తాన్‌వలీ** (ఆర్.టి.ఐ.)

**నాగార్జునరావు** (ఆర్.టి.ఐ.)

**నీలి యశోదరావు** (సహాయకార్యదర్శి)





కూకట్‌పల్లి నియోజకవర్గ పార్టీ సమావేశం



శ్రీకాకుళంలో అవినీతి వ్యతిరేక ర్యాలీ



సిసి కెమెరాల ఏర్పాటుపై నిర్లక్ష్యానికి నిరసనగా..



SC, ST సబ్‌ప్లాన్ అమలుపై ఆరాతీస్తున్న లోక్‌సత్తా నాయకులు




సనత్‌నగర్‌లో మహిళా సాధికారత సమావేశం

RNI.Reg. No. APTEL/2010/32219     Postal Reg. No. HD/1126/2013-15     Published on 1st January, 2014



శేరిలింగంపల్లిలో గోకుల్ ప్లాట్ హై టెన్షన్ లైన్ రోడ్ కబ్జాకు వ్యతిరేకంగా
ఆందోళనకు దిగిన డా॥ జేపీ

To,

**Book-Post**

PRINTED MATTER

If not delivered please return to:

**Lok Satta Times**

8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad